


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



ప్రధాని మోదీకి
రష్యా అత్యున్నత పౌర పురస్కారం
తొలి భారతీయ నేతగా ఘనత

18


జగన్ జమానాలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్థం

# భారం రూ.1,29,503 కోట్లు

శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు

- ప్రజలపై ఛార్జీల భారం రూ.32,166 కోట్లు
- విద్యుత్ సంస్థలపై అప్పు రూ.49,596 కోట్లు
- అసమర్థ పాలనతో జరిగిన నష్టం రూ.47,741 కోట్లు
- ఐదేళ్లలో విద్యుత్ రంగం సర్వనాశనం
- గాడి తప్పిన వ్యవస్థను తిరిగి పట్టాలెక్కిస్తాం
- ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే శ్వేతపత్రాలు
- రాగద్వేషాలకు అతీతంగా ప్రజలు ఆలోచించాలి

2




శ్వేత పత్రం ఫోటో ఫీచర్..
9,10 లో..

## సాగుకు సాయంగా నిలవాలి

బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

ఎస్ఎల్‌బీసీ సమావేశంలో రూ.5.4 లక్షల కోట్లతో రాష్ట్ర రుణ ప్రణాళిక విడుదల



- ప్రాధాన్య రంగాలకు రూ.3,75,000 కోట్లు
- ఇతర రంగాలకు రూ.1,65,000 కోట్లు
- కౌలు రైతులకు రుణాలు సులభతరం చేయాలన్న ముఖ్యమంత్రి
- పథకాల అమలుకు బ్యాంకులు సహకరించాలి
- సంపద సృష్టించే రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి
- 100 శాతం డిజిటల్ లావాదేవీలు సాధించాలి
- నోట్ల వాడకం పూర్తిగా తగ్గిస్తే అవినీతి పోతుంది
- 5 ప్రధాన అంశాలపై మంత్రులు, బ్యాంకర్లు, నిపుణులతో సబ్ కమిటీ

3

### పొలిటికల్ పెన్‌కౌంటర్



శ్వేతపత్రాల ద్వారా ప్రజలకు వాస్తవాలు చెబుతున్నాం. జగన్ అసమర్థ నిర్వాకం వల్ల విద్యుత్ సెక్టారు కుదేలైంది. దాదాపు లక్షన్నర కోట్ల నష్టం వాటిల్లింది. ఐదేళ్లలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నాశనం చేశారు. అసమర్థులు పరిపాలన చేస్తే ఏమవుతుందో ప్రజలు అర్థం చేసుకోవాలి.

విద్యుత్‌పై వెలువరించె
చంద్రబాబు శ్వేతపత్రం!
జలగన్నల గోలుమాలు
వెలుగుచూసే పచ్చి నిజం!!

అబద్ధాల పాలనలో
కుదేలైంది సెక్టారు!
నిలబెట్టుట సులువుగాదు..
అదే పెద్ద తకరారు!!

వ్యవస్థలను చెడబట్టిన
వైకాపా రాక్షసులు!
లక్షకోట్ల పైచిలుకు..
మిగిల్చెనుగా నష్టాలు!

ఆంధ్ర రాష్ట్ర ప్రగతికి
స్విచ్చు ఆపె జగను..
మెర్క్యురీ వెలుగులివ్వ
కదులుతుండు సీబీయన్ను!

-మహాదేవ

### రాష్ట్రంలో సినిమా రంగం అభివృద్ధికి సహకరిస్తాం



సీనియర్ నిర్మాత కేఎస్ రామారావుతో సీఎం చంద్రబాబు

- వివరాలు 8 లో..

### కిడ్నీ రాకెట్ కేసు ఛేదించండి



పోలీసులకు హోంమంత్రి అనిత ఆదేశం

16న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

- వివరాలు 6 లో..

### టీమిండియా హెడ్‌కోచ్‌గా గౌతం గంభీర్

అధికారికంగా వెల్లడించిన బీసీసీఐ కార్యదర్శి జై షా



- వివరాలు 16 లో..

### 'ప్రజాదర్బార్'తో లోకేష్ నూతన ఒరవడి!

- సమస్యలను విన్నవించేందుకు 14వ రోజు భారీగా తరలివచ్చిన ప్రజలు
- నమస్కారం తాతయ్య, నమస్కారం అమ్మ.. అంటూ మంత్రి ఆత్మీయ పలకరింపు
- విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి



4 లో

### 2026 నాటికి 'భోగాపురం' పూర్తిచేయాలి

- నిర్మాణసంస్థ జీఎమ్మార్‌కు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశం
- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో 6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు
- ఉత్తరాంధ్రకు గుండెకాయ భోగాపురం ఎయిర్‌పోర్టు



7 లో

## వైకాపా ఏడుపుకి ఇదే సాక్షి!

రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోన్న కూటమి ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతోంది జగన్ విషపుత్రిక సాక్షి. రాష్ట్రవ్యాప్తంగా స్టాక్ పాయింట్ల నుంచి ఉచిత ఇసుక తీసుకెళ్లడానికి తిరునాళ్ల మాదిరి ప్రజలు వరుస కడుతుంటే.. ఉచిత ఇసుక మోసపు విధానమంటూ రోతరాతలకు పదును పెట్టింది. గత ప్రభుత్వంలో ప్రజల్ని నానాయాతనలు పెట్టి, 40 లక్షలమంది భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టి.. వైకాపా సైకత రాకాసులు కోట్ల రూపాయల ఇసుక దోపిడీకి పాల్పడిన సంగతి తెలిసిందే. దోపిడీయే లక్ష్యంగా గత పాలకులు అమలు చేసిన 2019, 2021 ఇసుక విధానాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టడమే నీలిమీడియా కంటగింపునకు కారణం.


- వివరాలు 5 లో..

- ఉచిత ఇసుక విధానంపై రోత రాతలు
- పెత్తనమంతా పచ్చ నేతలదంటూ ఏడుపు
- అసత్యాలతో విష కథనాల ప్రచారం
- నిల్వ చేసుకున్న ఇసుక పంచేస్తుంటే బాధ
- భారీ ధరలకే అమ్మాలంటూ వక్ర సూచనలు
- మళ్లీ.. మన్నుగొట్టడానికే యత్నం
- కూటమి ప్రతిష్టపై విషంగక్కుతోన్న నైజం
- ప్రజలపై వైకాపాకు ఎందుకింత పగ?

## జగన్ జమానాలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్థం

# భారం రూ.1,29,503 కోట్లు

### శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు




అమరావతి(చైతన్యరథం): భావితరాల భవిష్యత్‌ను గత జగన్ ప్రభుత్వం ఎలా దెబ్బతీసిందో చెప్పి, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఐదేళ్లలో గత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సమూలంగా నాశనం చేసిందన్నారు. జగన్ తప్పుడు నిర్ణయాలతో విద్యుత్ రంగంలో ప్రజలకు, ప్రభుత్వానికి దాదాపు రూ.1,29,503 కోట్ల నష్టం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలపై రకరకాల చార్జీల పేరుతో రూ.32,166 కోట్ల భారాన్ని మోపిందని, విద్యుత్ రంగంలో రూ.49,596 కోట్ల అప్పు చేసిందన్నారు. జగన్ చేతకానితనంతో విద్యుత్ రంగం రూ.47,741కోట్లు నష్టపోయిందని చంద్రబాబు వివరించారు. మొత్తమ్మీద విద్యుత్ రంగంలో ప్రభుత్వ విధానాల వలన ప్రజలకు, ప్రభుత్వానికి రూ.1,29,503 కోట్ల నష్టం జరిగిందన్నారు. గాడి తప్పిన విద్యుత్ రంగాన్ని మళ్లీ పట్టాలెక్కిస్తామని చెప్పారు. అసమర్థుల పాలనలో జనానికి ఎంత నష్టం జరుగుతుందో చెప్పేందుకు జగన్ పాలన ఉదాహరణ అని వివరించారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశారు. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలని పిలుపునిచ్చాం.. ప్రజలు గెలిచి మమ్మల్ని గొప్ప స్థానంలో నిలబెట్టారు. అందుకే శ్వేతపత్రాల ద్వారా ప్రజలందరికీ వాస్తవాలు చెబుతున్నాం. అన్ని శాఖల్లో భయంకరమైన పరిస్థితులు ఉన్నాయి. సమర్థమైన పాలన వల్లే పేదలకు మెరుగైన ప్రయోజనాలు అందుతాయి. బాధ్యత లేని పరిపాలన వల్ల అనేక కష్టాలు ఎదురవుతాయి. డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించాలని బ్యాంకర్లకు చెప్పామన్న చంద్రబాబు రూ.500, 200 నోట్లు కూడా రద్దు చేయాలని కోరుతున్నాం అని అన్నారు. గత ప్రభుత్వం ఎంత నష్టం చేసిందో ప్రజలకు చెబుతున్నాం. అహంకారం ఉన్న వ్యక్తి అధికారంలో ఉంటే ఏమవుతుందనేది ఈ లెక్కలను చూస్తే అర్థమవుతుంది. రాగద్వేషాలకు అతీతంగా ప్రజలు ఆలోచించాలి.సంక్షేమం, అభివృద్ధి రెండు సమపాళ్లలో ఉండాలి. శ్వేతపత్రం అంటే తమకు సంబంధం లేదని ప్రజలు అనుకోవద్దు. వాస్తవ పరిస్థితి ప్రజలకు చెప్పడం మా బాధ్యత. అందరి ఆలోచనల మేరకు ముందుకు వెళ్తాం. విద్యుత్‌తో ప్రతి ఒక్కరి జీవితం ముడిపడి ఉంటుంది. అసమర్థులు అధికారంలో ఉంటే ఏమవుతుందో ప్రజలు అర్థం చేసుకోవాలని సీఎం చంద్రబాబు అన్నారు. విద్యుత్ రంగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా రిమోట్ మొరాయించడంపై చంద్రబాబు ఛలోక్తులు విసిరారు. పనిచేయకపోవడం వైఎస్సార్సీపీ ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిందని, సరి చూసుకోవాలని అధికారులకు చురకలు వేశారు.

- ప్రజలపై ఛార్జీల భారం రూ.32,166 కోట్లు
- విద్యుత్ సంస్థలపై అప్పు రూ.49,596 కోట్లు
- అసమర్థ పాలనతో జరిగిన నష్టం రూ.47,741 కోట్లు
- ఐదేళ్లలో విద్యుత్ రంగం సర్వనాశనం
- గాడి తప్పిన వ్యవస్థను తిరిగి పట్టాలెక్కిస్తాం
- ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే శ్వేతపత్రాలు
- రాగద్వేషాలకు అతీతంగా ప్రజలు ఆలోచించాలి



### విద్యుత్ రంగాన్ని నిలబెట్టిన సంస్కరణలు

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణల వల్ల మేము 2004 ఎన్నికల్లో ఓడి అధికారం కోల్పోయినా దేశం బాగుపడింది. నేను తెచ్చిన సంస్కరణల ఫలాలు తరువాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కనిపించాయి. ఈ సంస్కరణల కారణంగా విద్యుత్ రంగం రాష్ట్రంలో, దేశంలో నిలదొక్కుకుంది. మా హయాంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశాం. విద్యుత్ ఛార్జీలు పెంచకుండా చర్యలు తీసుకున్నాం. 2014-19లో సౌరశక్తి, పవన విద్యుత్ ఉత్పత్తి పెంచాం. 2018 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీ ఎదిగింది. 2018-19 నాటికి 14,929 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి చేరేలా కృషి చేశాం. మా హయాంలో ట్రాన్స్‌కో, జెన్కోకు ఎన్నో అవార్డులు వచ్చాయి. గత ఐదేళ్లలో ప్రజలపై రూ.32,166 కోట్ల ఛార్జీల భారం మోపారు. విద్యుత్ రంగంలో రూ.49,586 కోట్లు అప్పులు చేశారు. అసమర్థ పాలనతో విద్యుత్ రంగం రూ.47,741 కోట్లు నష్టపోయింది. జగన్ పాలనలో మొత్తమ్మీద విద్యుత్ రంగంలో ప్రజలకు, ప్రభుత్వానికి దాదాపు రూ.1,29,503 కోట్ల నష్టం జరిగింది. సాధ్యమైనంత త్వరగా విద్యుత్ రంగాన్ని గాడిలో పెడతామని చంద్రబాబు అన్నారు.

### ఓ భూతాన్ని రాజకీయంగా భూ స్థాపితం చేశాం

రాజకీయం ముసుగులో లూటీ చేసిన వ్యక్తులు ఇప్పుడు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజకీయ ముసుగులో బెదిరింపులు చేస్తే భయపడేది లేదని హెచ్చరించారు. నేరస్థులు,అవినీతి పరులు తప్పించుకోలేరని తెలిపారు. అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారని దుయ్యబట్టారు. ఉచిత ఇసుక ఇస్తామని చెప్పాం ఇప్పుడు అమలు చేస్తున్నామన్నారు. దీన్ని కూడా కొందరు రాజకీయం చేసి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి, అక్రమాలపై చట్ట ప్రకారం వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో ఓ భూతాన్ని రాజకీయంగా భూ స్థాపితం చేస్తామన్నారు. విచారణలు, ఎంక్వయిరీలు అంటే పెట్టుబడిదారులు భయపడి ఎవరూ రారని ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఇప్పటికే అయా సంస్థలేవీ పెట్టుబడులకు ముందుకు రాలేదన్నారు. రాష్ట్రంలో నిధుల లోటు ఉందని, అయినా ఇసుక ఉచితం గానే ఇస్తున్నామన్నారు. అక్రమాలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని చంద్రబాబు హెచ్చరించారు. అప్పుల వాళ్ళు రోజూ తిరుగుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న కొన్ని బిల్లులు క్లియర్ చేయాల్సి ఉందన్నారు.

### స్మార్ట్ మీటర్లపై త్వరలో నిర్ణయం

ట్రూఅప్, ఇంధన సర్‌ఛార్జి, ఎలక్ట్రిసిటీ డ్యూటీ అని రకరకాలుగా గత ప్రభుత్వం ప్రజల నుంచి విద్యుత్ ఛార్జీలు వసూలు చేసింది. గృహ వినియోదారులపై 45శాతం ఛార్జీలు పెంచారు. ఛార్జీల పెంపుతో కోటీ 53 లక్షల మంది ప్రజలు ఇబ్బంది పడ్డారు. 50 యూనిట్లు వాడిన పేదలపై వందశాతం ఛార్జీలు పెంచారు. టారిఫ్ ద్వారా రూ.16,689 కోట్లు, ట్రూ ఆప్ ద్వారా రూ.5,886 కోట్లు, ఇంధన ఛార్జీలు రూ.3,977కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో రూ.5,607 కోట్ల మేరవసూలు చేశారు. కేవలం గృహ వినియోగదారులపైనే రూ.8,180కోట్ల భారం పడింది. పెత్తందారులు, పేదవారికి పోటీ అని చెప్పేవాడు. ఈ పెత్తందారీ పాలనలో పేదవాడు ఎలా నలిగిపోయాడో అందరికీ తెలిసింది.

రూ.వేల కోట్ల రుణం తీసుకుని విద్యుత్‌రంగంపై పెనుభారం వేశారు. ఐదేళ్లలో విద్యుత్ సంస్థల అప్పు 78శాతం మేర పెరిగింది. కొన్ని సార్లు ఉత్పత్తి నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయాలు కూడా ప్రజల పై భారం మోపాయి. విద్యుత్ వాడుకోకపోయినా కోర్టు ఆదేశంతో నిర్వహణ ఛార్జీలు రూ.8వేల కోట్లు చెల్లించారు. పవన విద్యుత్‌రంగంలో చేసుకున్న 21 ఒప్పందాలు రద్దు చేశారు.భవిష్యత్తులో విద్యుత్ వాహనాలు మరింత పెరుగుతాయి. ఈవీ వాహనాల డిమాండ్ మేరకు విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవాలి. టారిఫ్ నియంత్రణపై దృష్టి సారిస్తాం. విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టేందుకు కేంద్రం సాయం తీసుకుంటాం. వ్యవసాయ పంప్ సెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు చెప్పారు.

### రూఫ్ టాప్ సౌరశక్తి ఉత్పత్తి పెంచేందుకు చర్యలు

థర్మల్ విద్యుత్‌ను గ్రీన్ హైడ్రోజన్‌గా మార్చేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ వస్తే మనకు అదనంగా రాయితీలు వస్తాయి. రూఫ్ టాప్ సౌరశక్తి ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలపై కమిటీ నిర్ణయిస్తుంది. విద్యుత్ సరఫరాలో నష్టాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యుత్ రంగం బలోపేతానికి సాంకేతిక సాయం తీసుకుంటాం. జగన్ అహంకారం వల్ల ఒక్క పోలవరం ప్రాజెక్టులోనే 4,773 కోట్ల మేర ప్రభుత్వంపై అదనపు భారం పడింది. సెకి నుంచి కొనుగోలు చేయాల్సిన 7వేల మెగావాట్ల వల్ల ఒక్క ట్రాన్స్మిషన్ కోసమే రూ.3,850 కోట్ల నుంచి 4,350 కోట్ల వరకు అదనంగా చెల్లింపులు చేయాల్సి వచ్చింది. గత ప్రభుత్వం చేతగాని తనం వల్ల ఊహించని కోణాల్లో విద్యుత్ సంస్థలకు నష్టాలు వస్తున్నాయి. ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ బాండ్లలో.. ఏపీ జెన్కో, ట్రాన్స్‌కోలు పెట్టుబడులు పెట్టాయంటే జగన్ ప్రభుత్వం ఎలాంటి దుష్ట ఆలోచనలు చేసిందో అర్థం అవుతోందని చంద్రబాబు వివరించారు.

### పీఎఫ్ డబ్బులు కొట్టేసేందుకు ప్రయత్నించారు

ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల పీఎఫ్ ఫండ్ డబ్బులు కూడా కొట్టేసే ప్రయత్నం చేశారని, ఎక్కడ డబ్బు దొరికితే అక్కడ కొట్టేశారని సీఎం చంద్రబాబు అన్నారు. పవర్ సెక్టార్‌లో గ్రోత్ లేకపోవడంతో పారిశ్రామిక అభివృద్ధి ఆగిపోయిందని చంద్రబాబు వెల్లడించారు. పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. ఈ పరిస్థితి నుంచి బయట పడాలంటే ఏం చేయాలనే అంశంపై ఆలోచిస్తున్నాం. ఇది చాలా పెద్ద కసరత్తు. నా రాజకీయ జీవితంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడు చూడలేదు. ఇటువంటి పరిస్థితి నేను ఎప్పుడూ ఎదుర్కొనలేదని చంద్రబాబు అన్నారు.

### ఎక్కడా విద్యుత్ కోతలు ఉండొద్దు

విద్యుత్ కోతలు ఎక్కడా ఉండడానికి వీలులేదని సీఎం చంద్రబాబు అన్నారు. లో ఓల్టేజ్ ఉండకూడదని, నాణ్యమైన కరెంట్ ఇవ్వాలని అధికారులకు సూచనలు చేశారు. ఎక్కడ పవర్ కట్ ఉండేందుకు వీలులేదని, ఇప్పుడే అధికారులను ఆదేశిస్తున్నానని అన్నారు. ఎక్కడి నుంచి ఫిర్యాదు వచ్చినా ఊరుకోబోనని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# సాగుకు సాయంగా నిలవాలి

## బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

## ఎస్ఎల్‌బీసీ సమావేశంలో రూ.5.4 లక్షల కోట్లతో రాష్ట్ర రుణ ప్రణాళిక విడుదల

- ప్రాధాన్య రంగాలకు రూ.3,75,000 కోట్లు
- ఇతర రంగాలకు రూ.1,65,000 కోట్లు
- కౌలు రైతులకు రుణాలు సులభతరం చేయాలన్న ముఖ్యమంత్రి
- పథకాల అమలుకు బ్యాంకులు సహకరించాలి
- సంపద సృష్టించే రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి
- 100 శాతం డిజిటల్ లావాదేవీలు సాధించాలి
- నోట్ల వాడకం పూర్తిగా తగ్గిస్తే అవినీతి పోతుంది.
- 5 ప్రధాన అంశాలపై మంత్రులు, బ్యాంకర్లు, నిపుణులతో సబ్ కమిటీ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో వ్యవసాయానికి ఊతమిచ్చేలా బ్యాంకులు పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కౌలు రైతులకు రుణాలు సులభంగా అందే పరిస్థితి రావాన్నారు. దీని కోసం బ్యాంకులు, ప్రభుత్వం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్బీసీ) సమావేశంలో చంద్రబాబు అన్నారు.
సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో ఎస్ఎల్బీసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,40,000 కోట్లతో రుణ ప్రణాళికను విడుదల చేశారు. రూ.3,75,000 కోట్లు ప్రాధాన్య రంగాలకు, రూ.1,65,000 కోట్లు ఇతర రంగాలకు కేటాయిస్తూ రుణ ప్రణాళిక విడుదల చేశారు. వ్యవసాయ రంగానికి రూ.2,64,000 కోట్లు రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యవసాయ రంగానికి గతం కంటే 14 శాతం అధికంగా రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. డెయిరీ, ఫౌల్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ యాంత్రీకరణకు, వ్యవసాయం రంగంలో మౌలిక సదుపాయాలకు రూ.32,600 కోట్లతో రుణ ప్రణాళిక రూపొందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రాధాన్యతా రంగానికి రూ.3,23,000 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా... ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3,75,000 కోట్లు రుణ ప్రణాళికా లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గతంతో పోల్చితే 16 శాతం అధికంగా రుణాల లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యవసాయ రంగానికి గత సంవత్సరం రూ.2,31,000 కోట్లు రుణ లక్ష్యంగా పెట్టుకోగా అందులో 90 శాతం మేర రూ.2,08,136 కోట్ల రుణాలు మంజూరు జరిగిందని సమావేశంలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడే మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగానికి 2023-24 ఏడాదిలో రూ.69,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, ఈ ఏడాది ఏకంగా రూ.87,000 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అలాగే గృహ నిర్మాణానికి రూ.11,500 కోట్లు రుణాలు, సాంప్రదాయేతర ఇంధన సెక్టార్ కు రూ. 8,000 కోట్లు రుణాలు ఇవ్వనున్నారు.

### 5 ప్రధాన అంశాలపై మంత్రులు, బ్యాంకర్లతో సబ్ కమిటీ

గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల అన్ని వ్యవస్థలు కుదేలయ్యాయని... మళ్లీ గాడిన పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంపై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారని.. వాటిని నెరవేర్చేందుకు తీసుకుంటున్న చర్యలకు బ్యాంకులు చేయూతనివ్వాలని చంద్రబాబు అన్నారు. వ్యవసాయ రంగంలో సాగు ఖర్చులను తగ్గించాల్సిన అవసరం ఉందని... దీనిపై ప్రభుత్వం, బ్యాంకులు కలిసి పని చేయాలని సీఎం అన్నారు. ఐదు ప్రధాన అంశాలపై మంత్రులు, బ్యాంకర్లు, ఆయా రంగాల నిపుణులతో సబ్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ రంగాలు ఇవే..

1. వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించడం, కౌలు రైతులకు సులభంగా రుణాలు అందించడం, మెరు గైన పంటల బీమాను అందుబాటులోకి తేవడం
2. పీ 4 విధానం ద్వారా పేదరిక నిర్మూలనకు అవసర మైన ప్రాజెక్టులు, ప్రణాళిక చేపట్టడం
3. డిజిటల్ లావాదేవీల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడం
4. స్కిల్ డెవల్మెంట్‌కు చర్యలు తీసుకోవడం
5. సంపద సృష్టించే, జీఎస్‌డీపీ పెంచే రంగాలకు తగు ప్రోత్సాహం ఇవ్వడం

ఈ ఐదు అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి, అమ లు చేసేందుకు ఈసబ్ కమిటీ పనిచేస్తుందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా కౌలు రైతులకు రుణాల విష యంలో ఉన్న ఆంక్షలను తొలగించి వారు సులభంగా రుణాలు పొందే పరిస్థితి కల్పించాలని చంద్రబాబు అన్నారు. పలు కీలక అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం, బ్యాంకులు కలిసి పని చేయాలన్నారు. సంపద సృష్టించే రంగాలకు ప్రోత్సాహం ఇచ్చే అంశంపై బ్యాంకులు ఫోకస్ పెట్టాలని అన్నారు. డిజిటల్ లావాదేవీల్లో ఏపీ ప్రభుత్వం మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా ఉందని... రానున్న రోజుల్లో నెంబర్ 1గా నిలిచే ప్రణాళికలు అమలు చేయాలని సీఎం అన్నారు.

డిజిటల్ చెల్లింపులను బ్యాంకులు కూడా ప్రోత్సహించాలని చెప్పారు. దీని వల్ల అవినీతి తగ్గుతుందని... ప్రొడక్టవిటీ పెరుగుతుందని చంద్రబాబు తెలిపారు. పేదరికం నిర్మూలన విషయంలో ప్రభుత్వం కొత్తగా పీ 4 విధానం తీసుకువస్తుందని సీఎం చెప్పారు. ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల విషయంపైన సబ్ కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. యువతలో నైపుణ్యాలు పెంచడంపై తమ ప్రభుత్వం దృష్టిపెట్టిందని... స్కిల్ డెవలప్‌మెంట్‌కు తీసుకోవాల్సిన చర్యలపై సబ్ కమిటీ అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇకపోతే సంపద సృష్టించే, జీఎస్‌డీపీ పెంచే రంగాలకు బ్యాంకుల ప్రోత్సాహం అవసరమన్న దానిపైనా ఎలా ముందుకు వెళ్లాలి అనే విషయంలో సబ్ కమిటీ చర్చిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ అంశాల్లో సత్వర నిర్ణయాలు, మెరుగైన ఫలితాలు సాధించే విధంగా మంత్రులు, బ్యాంకర్లు, ఆయా రంగాల నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు నాయుడు తెలిపారు.

### హార్టి, ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించాలి: అచ్చెన్నాయుడు

సమావేశంలో వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... హార్టికల్చర్, ఆక్వా కల్చర్‌కు బ్యాంకులు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో హార్టికల్చర్ పూర్తిగా నాశనం అయ్యిందని... తిరిగి నిల బెడితే రైతులకు మేలు జరుగుతుందన్నారు. పాడి పరిశ్రమ వృద్ధి చెందేలా ఆవులు, గేదెలు కొనుగోలుకు బ్యాంకులు ఆంక్షలు లేకుండా రుణాలు ఇవ్వాలని సూచించారు. కౌలు రైతులకు రుణం అందడం చాలా కష్టంగా మారిపోయిందని తెలిపారు.

### బ్యాంకులు బాసటగా నిలవాలి: పయ్యావుల

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ 93శాతం స్ట్రైక్‌రేట్‌తో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారని... కొత్త ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న అనేక ఆశలను తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అయితే వీటికి బ్యాంకు సహకారం అవసర మన్నారు. బ్యాంకులు రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో విశ్వసనీయ భాగస్వాములు కావాలన్నదే సీఎం చంద్రబాబు అభిప్రాయమని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కరువు ప్రాంతంలో సిరులు పండించిన చంద్రబాబు ఆలోచనలకు బ్యాంకులు బాసటగా నిలవాలని సూచించారు. అంతా డబుల్ డిజిట్ గ్రోత్ గురించి మాట్లాడుతుంటే... సీఎం చంద్రబాబు ఎకానమీని డబుల్ చేయాలనే ఆలోచనలతో పని చేస్తున్నారని అన్నారు.
కాగా 4వ సారి ముఖ్యమంత్రి అయిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఎస్.ఎల్.బీ.సీ సమావేశం శుభాకాంక్షలు తెలిపింది. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ రుద్ర, ఎస్.ఎల్.బీసీ కన్వీనర్ సీ.వి.ఎస్ భాస్కర్ రావు, ఇతర బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'ప్రజాదర్బార్'తో లోకేష్ నూతన ఒరవడి!

- సమస్యలను విన్నవించేందుకు 14వ రోజు భారీగా తరలివచ్చిన ప్రజలు
- నమస్కారం తాతయ్య, నమస్కారం అమ్మ.. అంటూ మంత్రి ఆత్మీయ పలకరింపు
- విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి



అమరావతి(చైతన్యరథం): విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలోని నివాసంలో నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్' ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన ఒరవడితో ముందుకు సాగుతోంది. సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజలను నమస్కారం తాతయ్య, నమస్కారం అమ్మ, నమస్కారం చెల్లి అంటూ ఆత్మీయంగా పలకరిస్తున్న యువనేత.. వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్నారు. గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురిచేశారు. నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరిని నేరుగా కలిసి విజ్ఞప్తులను స్వీకరించడంతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో 14వ రోజు మంగళవారం ప్రజాదర్బార్ కు మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

## ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కొంతమంది ఆయాలు, పారిశుద్ధ్య కార్మికులను గత ప్రభుత్వం అర్ధాంతరంగా తొలగించిందని, ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన ఏపీజీసీఏఎస్ యూనియన్ ప్రతినిధులు.. నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని,పాఠశాలల విలీనం వల్ల పనిఒత్తిడి పెరిగిందని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కనీసం వేతనం అమలు చేయడంతో పాటు అకారణంగా విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.ఆయాలు, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను విన్న మంత్రి లోకేష్.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

పక్షవాతంతో బాధపడుతున్న తనకు పెన్షన్‌మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం మెల్లంపూడికి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు.. లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన సతీమణి వైద్యఖర్చులకు ఆర్థిక సాయం చేయాలని మంగళగిరి హుడా కాలనీకి చెందిన షేక్ మౌలాలి కోరారు.దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడేపల్లి కిస్నా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీతం బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కేసీ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తమ ప్రాంతంలో తాగునీటి సరఫరాతో పాటు వీధి లైట్లు ఏర్పాటుచేయాలని ఆత్మకూరులోని సీతారామ అపార్ట్‌మెంట్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరిపించి, తక్షణమే కొత్తవైస్ ఛాన్సలర్‌ను నియమించాలని విశాఖకు చెందిన ఏపీ బీసీ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లా నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తున్న తనను గత ప్రభుత్వం అకారణంగా తొలగించిందని, తిరిగి ఉద్యోగం కల్పించాలని ఎన్. మహేశ్వరి కోరారు. శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న తనకు మినిమమ్ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డీసీ ఉన్నూరు సాహెబ్ కోరారు. గుంతకల్లు నియోజకవర్గం కసాపురం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేయించి 8 గ్రామాల ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలని వై.జీవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మూడేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న దివ్యాంగ ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించాలని విజయవాడకు చెందిన ఏపీజీఎస్ డబ్ల్యూఎస్ దివ్యాంగ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఇప్పటికే శిక్షణ పూర్తిచేసుకున్న వారికి పరీక్ష నిర్వహించాలని, అర్హత పత్రాలు మంజూరు చేయాలని, ఆర్ఎంపీ బోర్డు ఏర్పాటుచేయాలని ఆ సంఘాల ప్రతినిధులు.. నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లోకేష్ భరోసా ఇచ్చారు.














# వైకాపా ఏడుపుకి ఇదే సాక్షి!

- ఉచిత ఇసుక విధానంపై రోత రాతలు
- పెత్తనమంతా పచ్చ నేతలదంటూ ఏడుపు
- అసత్యాలతో విష కథనాల ప్రచారం
- నిల్వ చేసుకున్న ఇసుక పంచేస్తుంటే బాధ
- భారీ ధరలకే అమ్మాలంటూ వక్ర సూచనలు
- మళ్లీ.. మన్నుగొట్టడానికే యత్నం
- కూటమి ప్రతిష్టపై విషంగక్కుతోన్న వైనం
- ప్రజలపై వైకాపాకు ఎందుకింత పగ?



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోన్న కూటమి ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతోంది జగన్ విషపుత్రిక సాక్షి. రాష్ట్రవ్యాప్తంగా స్టాక్ పాయింట్లనుంచి ఉచిత ఇసుక తీసుకెళ్లడానికి తిరునాళ్ల మాదిరి ప్రజలు వరుస కడుతుంటే.. ఉచిత ఇసుక మోసపు విధానమంటూ రోత రాతలకు పదును పెట్టింది. గత ప్రభుత్వంలో ప్రజల్ని నానాయాతనలు పెట్టి, 40 లక్షలమంది భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టి.. వైకాపా సైకత రాకాసులు కోట్ల రూపాయల ఇసుక దోపిడీకి పాల్పడిన సంగతి తెలిసిందే. దోపిడీయే లక్ష్యంగా గత పాలకులు అమలు చేసిన 2019, 2021 ఇసుక విధానాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టడమే నీలిమీడియా కంటగింపునకు కారణం. వైకాపా సర్కారే మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో.. కోట్ల రూపాయలు సొమ్ము చేసుకోవడానికి ముందే తవ్వుకుని ఇసుకను దాచుకున్నారు. అలా దాచుకున్న ఇసుక పరిమాణం 48 లక్షల మెట్రిక్ టన్నులని అంచనా. అంటే, వైకాపా దృష్టిలో వేల కోట్ల రూపాయల ఇసుక. ఇప్పుడు దాన్ని ఉచితంగా ప్రజాపరం చేస్తున్న కూటమి విధానాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ప్రస్తుతం నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుక, పూడికరూపంలో జలాశయాల్లో ఉన్నది ప్రజలకు సరఫరా చేసేలా కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే.

## ఖర్చులు పెట్టుకుంటే చాలు..

ప్రభుత్వానికి ఎటువంటి రాబడి లేకున్నా.. కేవలం సీనరేజ్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు వంటివి మాత్రమే వినియోగదారుల నుంచి తీసుకొని, ఇసుక అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాను అధికారంలోకి వస్తే తిరిగి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెస్తానని మాటిచ్చిన చంద్రబాబు.. అన్న మాట ప్రకారం ఇసుకను ప్రజాపరం చేశారు. కలెక్టర్ నేతృత్వంలో జిల్లాస్థాయి ఇసుక కమిటీలకు అధికారం కల్పిస్తూ.. పారదర్శకంగా డిజిటల్ చెల్లింపులనే అంగీకరిస్తూ.. ఏ రోజుకు ఆరోజు ఇసుక నిల్వల వివరాలు ప్రకటిస్తూ.. పారదర్శక విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీన్నే వైకాపా విషపుత్రిక జీర్ణించుకోలేకపోతోంది. ఉచితంగా ఇసుక ఇస్తున్నామంటూనే.. స్టాక్‌యార్డుల వద్ద ధరల పట్టికలు పెట్టారంటూ పైత్యపు రాతలకు తెగబడుతోంది. వైకాపా మూకలే ఇసుక ధరలతో ఫ్లెక్సీలు వేసి.. వాటి ఫోటోలను ప్రచారంలోకి తెచ్చి.. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం, వైకాపా దిగజారుడు తనానికి పరాకాష్ట. ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామన్న ప్రభుత్వం మాటలు మాయ నాటకాలుగా తేలిపోయిందంటూ అసత్యాల ప్రచారానికి తెగబడటం సిగ్గుచేటు. ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చి ఒక్కరోజు కూడా పూర్తికాకమునుపే.. కోట్ల రూపాయల ఇసుకను తినేస్తున్నారంటూ అభూత కల్పనలు ప్రచారం చేయడం.. పేదల నోట మన్నుగొట్టడానికే.

## ఫ్లెక్సీలు వాళ్లవే.. ప్రచారమూ వాళ్లదే

వైకాపా మూకలే ఫ్లెక్సీలు వేసి.. ప్రదర్శనకు పెట్టి.. కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన ఉచిత ఇసుక హామీకి స్టాక్ యార్డుల వద్ద పెట్టిన ధరల పట్టికలతో సీఎం చంద్రబాబు తూట్లు పొడిచారంటూ కథనాలు రాయడం సాక్షికే చెల్లింది. మళ్లీ వైసీపీ గద్దెనెక్కితే.. వర్షాకాలంలో ఇసుక వ్యాపారానికి అడ్డులేకుండా గుత్తేదారులు ముందే ఇసుక మేటలు నిల్వచేశారు. వైకాపాకు ప్రజలు తెల్లకొట్టడంతో.. ఆ ఇసుక నిల్వలు ప్రజలకోసమే సిద్ధం చేసినట్టు నమ్మబలుకుతోంది విషపత్రిక. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఇప్పటికే స్టాక్ పాయింట్లలో పెద్దఎత్తున పెట్టిన ఇసుక నిల్వలను కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసేస్తుండటంతో.. వైకాపా సైకత రాక్షసులు జీర్ణించుకోలేకపోతున్నారు. 21 జిల్లాల్లోని 88 నిల్వ కేంద్రాల్లో 40 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ప్రజల పరమైపోతుందన్న బాధతో ప్రభుత్వంపై విషం జిమ్ముతోంది. 'ఉచితం' అంటే ప్రభుత్వానికి రాబడి ఆశించకుండా అని అర్థం. అలాంటిది ఉచితం అన్న పదానికి వక్రభాష్యం చెబుతూ.. ఉచితంగా ఇస్తానన్న ఇసుకకు ధర నిర్ణయించారంటూ గగ్గోలు పెట్టడం మడత కథనాలు అల్లే నీలిపత్రికకే చెల్లు.

## భారీ ధరలకే అమ్మాలంటూ వక్ర సూచనలు

ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వడం -నీలిపత్రిక దృష్టిలో ఏమాత్రం మేలు కాదు. అందుకే ప్రజలకు ఎలాంటి మేలు చేయని పథకంగా ఇసుక విధానాన్ని అభివర్ణించడం సాక్షికే చెల్లింది. అలాగే.. ఖజానాకు ఆదాయం సమకూరని తాత్కాలిక కొత్త విధానాన్ని కూటమి ప్రభుత్వం తెచ్చిందంటూ విష ప్రచారానికి దిగింది. అంటే, సాక్షి ఉద్దేశం ప్రజలకు ఉచితంగా ఇసుక ఇవ్వకూడదు. వైకాపా సర్కారీ విధానంలోనే ప్రజలకు ఇసుక అందకుండా చేసి.. భారీ ధరలకు అమ్ముకోవాలన్న వక్ర సూచనలు చేయడం నిస్సిగ్గుతనం. వైకాపా ఏలుబడిలో ఒక్క ఇసుకమీదే ఏటా రూ.750 కోట్ల ఆదాయం సమకూర్చినట్టు చెప్పుకోవడం అబద్ధాల సమర్థింపే. సామాన్యుడికి ఇసుక అందకుండాచేసి ఏటా వేల కోట్ల రూపాయల దోపిడీ సాగించిన వైకాపా సర్కారు.. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చామని చెప్పుకోవడం దారుణం. పైగా వైఎస్సార్సీపీ హయాంలో పారదర్శకంగా ఇసుక విక్రయాలు చేపట్టామని, ప్రజలకు సులభంగా, అందుబాటు ధరలో అందించామని అసత్యాలు వల్లెవేయడం ఆత్మవంచన!

## నిల్వ చేసుకున్న ఇసుక పంచేస్తుంటే బాధ

అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఇసుక స్టాక్ పాయింట్లపై కూటమి సర్కారు దృష్టి పెట్టడం.. వైకాపా గుత్తేదారులకు ఇసుకను తరలించుకుపోయే అవకాశం లేకుండా పోయింది. వర్షాకాలంలోనూ వ్యాపారం యథేచ్ఛగా సాగించేందుకు స్టాకు చేసి పెట్టుకున్న 40 లక్షల టన్నుల ఇసుకను వైఎస్సార్సీపీ గుత్తేదారులు వదిలేయాల్సి వచ్చింది. నదీగర్భాలను దీల్చి తీసిన ఇసుకంతా అక్రమ తవ్వకాలే. భారీ మెజారిటీతో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో -దొరికిపోతామన్న భయంతో ఇసుక కాంట్రాక్టు సంస్థలైన జేసీకేసీ, ప్రతిమ ఇన్ఫ్రా ప్రతినిధులు సైలెంట్‌గా పక్కకు తప్పుకున్నారు.

## మళ్లీ.. మన్నుగొట్టడానికే యత్నం..

నిర్మాణ రంగానికి ఇసుకే ప్రధానం. లక్షలమందికి నిర్మాణ రంగమే జీవనాధారం. ఇసుక ధరలను నియంత్రణలో ఉంచకపోతే సామాజిక, ఆర్థిక రంగాలపై తీవ్రప్రభావం చూపిస్తుందనడంలో సందేహం లేదు. దీనివల్ల రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. పెట్టుబడులపై ప్రభావం పడుతుంది. పారిశ్రామికీకరణకు విఘాతం కలుగుతుంది. అందుకే -నిర్మాణ రంగానికి కీలకమైన ఇసుకను ప్రజాప్రయోజనాల దృష్ట్యా వినియోగదారులకు అందుబాటు ధరలో ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటివల్ల రాష్ట్రమంతటా భవన నిర్మాణాలు, నీటిపారుదల పనులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, రాజధాని భవనాలు తదితరాల నిర్మాణాలకు సరసమైన ధరల్లో ఇసుక అందుబాటులోకి వస్తుంది. విధ్వంసాన్ని కోరుకునే వాళ్లకు ఇలాంటి ప్రగతి నచ్చదు. అందుకే -ప్రభుత్వ సదుద్దేశానికి తూట్లు పొడిచే కథనాలను రాస్తోంది నీలిమీడియా. ప్రజల్లో గందరగోళం సృష్టించి ఉచిత ఇసుక విధానాన్ని దెబ్బతీసేందుకు విశ్వప్రయత్నం చేస్తోంది. పైగా ఉచిత ఇసుక విధానంతో ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ఠ పెరగడాన్ని సైతం జీర్ణించుకోలేకపోతోంది.

## జిల్లా ఇసుక కమిటీలే కీలకం

ఇసుక లావాదేవీల్లో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా పారదర్శక, కఠినమైన నియమ నిబంధనలు విధించినా.. స్టాకులో సగం ఇసుకను తినేశారంటూ తొలిరోజే కథనాలు అల్లడం 'విషపుత్రిక'కే చెల్లింది. వాస్తవానికి -ఇసుక లావాదేవీల్లో జిల్లాస్థాయి ఇసుక కమిటీలకు పూర్తి బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. కలెక్టర్ చైర్మన్, ఎస్పీ, జేసీ, సబ్ లెక్టర్/ ఆర్డీవో, ఎస్ఈబీ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్టీవో, భూగర్భజలశాఖ డీడీ, జలవనరులశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, కాలుష్యనియంత్రణ మండలి ఈఈలు సభ్యులుగా, జిల్లా గనులశాఖ అధికారి కన్వీనర్‌గా సెటప్ పెట్టింది. నిల్వ కేంద్రాలకు ఇన్‌చార్జిలుగా వీఆర్వో, వీఏవో, గ్రామ, వార్డు సచివాలయ అధికారుల్లో ఒకరిని కలెక్టర్ నియమిస్తారు. ఇసుక తవ్వి, రీచ్‌నుంచి నిల్వ కేంద్రానికి రవాణా చేసినందుకు అయిన నిర్వహణ ఖర్చు, స్టేషనరీ వ్యయం, సీనరేజ్ ఫీజు, జీఎస్టీ మాత్రమే వినియోగదారుల నుంచి తీసుకుంటారు. ఈ ఖర్చులు టన్నుకు ఎంత పడుతుందనేది జిల్లాస్థాయి కమిటీ ఖరారు చేస్తుంది. అలాగే స్టాకు ఎంతవుంది? ఎప్పటినుంచి ఎప్పటి వరకూ విక్రయాలు, ఒకరికి రోజులు ఎన్ని టన్నుల ఇసుక ఇస్తారు, ఖరారు చేసిన ఇసుక ధరను డిజిటల్ రూపంలో చెల్లింపు, ముందు వచ్చినవారికే ముందు లోడు. నిర్మాణ అవసరాలకు మించి ఇసుక నిల్వ చేసినా, తిరిగి అమ్మినా, ఇతర అవసరాలకు వినియోగించినా, ఇతర రాష్ట్రాలకు తరలించినా క్రిమినల్ కేసులు పెడతారు. జరిమానాలు విధిస్తారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే రూ.2 వేలనుంచి రూ. లక్ష వరకు జరిమానా విధిస్తారు. ఇన్ని నిబంధనలు పెట్టినా.. అక్రమాలు జరుగుతున్నాయంటూ గగ్గోలు పెట్టడం.. నీతిమాలిన నీలిపత్రికకే చెల్లు.

## ఇది కదా నిజం!

నాడు జగన్‌రెడ్డి ఇసుక రేట్లు ప్రకటిస్తూ ప్రముఖ పత్రికలో ఇచ్చిన ప్రకటనలు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక విధానంలో కేవలం లోడింగ్, రవాణా చార్జీలు తీసుకుంటూ టన్ను ఇసుకకు పెట్టిన ధర. పోల్చిచూస్తే.. జగన్ సర్కారు మూడు రెట్లు ఎక్కువ ప్రజల దగ్గర పీక్కుతిని తాడేపల్లి ప్యాలెస్‌లో మూటలు దాచుకున్న విషయం అర్థమవుతుంది. 40 లక్షలమంది బడుగులైన భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా చేసిన పాపమూ అవగతమవుతుంది.




## కొడాలి నానికి షాక్

### చంద్రబాబు ఉచిత ఇసుకపై సైలెంట్



ప్రత్యర్థులపై మాటల యుద్ధానికి సిద్ధమయ్యే కొడాలి నాని-చంద్రబాబు ఉచిత ఇసుక విధానంతో మూగవాడై పోయాడు. పార్టీ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో వాస్తవాలు పరిశీలించి.. ఉచిత ఇసుక విధానాన్ని రాద్ధాంతం చేద్దామనుకున్న వైకాపా మాజీ ఎమ్మెల్యే.. యథార్థాన్ని గ్రహించి అవాక్కయ్యాడు. ఔను, ఉచిత ఇసుక కోసం సొంత ట్రాక్టర్‌తో గుడివాడ సమీపంలోని స్టాక్ పాయింట్‌కు వెళ్లిన కొడాలి నానికి టన్ను ఇసుక కేవలం రూ.88కే లభించింది. చంద్రబాబు అమలు చేస్తున్న ఉచిత ఇసుకను సొంత ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని సైలెంట్‌గా వెళ్లిపోయాడు కొడాలి నాని. తన సొంత ట్రాక్టర్ కావడం, రవాణా చార్జీలు లేకపోవటంతో ట్రాక్టర్ ఇసుకకు రూ.500 లోపే డబ్బు కట్టి తీసుకెళ్లాడు. వైసీపీ సోషల్ మీడియాలో కథనాలు నమ్మి రాద్ధాంతం చేయడానికి వచ్చిన నాని.. స్టాక్ పాయింట్ దగ్గర సీన్ చూసి షాకయ్యారు. మొత్తానికి 'బాబు ఉచిత ఇసుక భేష్' అని మనసులోనైనా అనుకుని ఉండాలి.

## 16న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

**ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్‌కు ఆమోదం**

అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వ మంత్రివర్గం ఈ నెల 16న సమావేశం కానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. కేబినెట్ భేటీలో ముఖ్యంగా.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు, ఎన్నికల హామీలపై చర్చించనున్నారు. ఈ నెల 22 నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో.. ఓట్ ఆన్ అకౌంట్‌పై ఇచ్చే ఆర్డినెన్స్‌కు సైతం కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం అమలు చేయాల్సిన పథకాలపైనా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కాల పరిమితి జులై 31 వరకు ఉంటుంది. దాంతో, ప్రస్తుతానికి తాత్కాలిక బడ్జెట్ కోసం కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురానుంది. సెప్టెంబరులో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఇప్పటికే కేబినెట్ భేటీకి సంబంధించి మంత్రులకు సమాచారం కూడా వెళ్లింది.

### బోర్డు పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టుల అంశం సుప్రీంలో విచారణ ఆగస్ట్ 20కి వాయిదా

ఢిల్లీ: కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ) పరిధిలోకి తీసుకువచ్చే అంశంపై సుప్రీంకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాలకు అనుమతులు లేకుండా నీటిని వినియోగిస్తున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ గతంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఒఖా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ విషయంపై కేంద్రం నుంచి తగిన ఆదేశాలు తీసుకుని తాజాగా అఫిడవిట్ దాఖలు చేస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటియా కోర్టుకు తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి ఇవ్వడం తమకు సమ్మతమేనని ఆంధ్రప్రదేశ్ గతంలోనే చెప్పింది. ఇదే అంశంపై విముఖత వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో రెండు ప్రభుత్వాల అభిప్రాయాలకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఇరు రాష్ట్రాల న్యాయవాదులు అన్నారు. అయితే నోటిఫికేషన్ జారీ చేయడానికి కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని కేంద్రం (కేఆర్ఎంబీ) తరపు అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఈ విషయంలో కేంద్రం నుంచి తగిన సూచనలు, ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. ఆ లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

### ఏపీ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ రామాచార్యులు రాజీనామా

వైసీపీకి అనుకూల అధికారిగా ముద్రపడిన ఏపీ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ రామాచార్యులు మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి తన రాజీనామా లేఖను పంపారు. శాసనసభ నిర్వహణలో రామాచార్యుల వైఖరిపై అభియోగాలు ఉన్నాయి. ఇటీవల ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా అయ్యన్నపాత్రుడు బాధ్యతలు స్వీకరించే సమయంలో... అసెంబ్లీ ప్రసారాలపై పలు టీవీ చానళ్లపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసే ఫైలు సిద్ధం చేయడంలోనూ రామాచార్యులు వ్యవహరించి తీరు చర్చనీయాంశం అయింది. అయ్యన్న స్పీకర్ హోదాలో తొలి సంతకం చేసే ఫైలు విషయంలో రామాచార్యులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారని, ఆ మూడు చానళ్లపై నిషేధం ఎత్తివేత అంశాన్ని పక్కదారి పట్టించే యత్నం చేశారని ఆరోపణలు వచ్చాయి.

# కిడ్నీ రాకెట్ కేసు ఛేదించండి

**- పోలీసులకు హోంమంత్రి అనిత ఆదేశం**




విజయవాడ: ఇటీవల విజయవాడలో వెలుగులోకి వచ్చిన కిడ్నీ రాకెట్ వ్యవహారంపై హోం మంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మంగళవారం గుంటూరు కలెక్టర్, ఎస్పీ, విజయవాడ సీపీతో ఆమె ఫోన్లో మాట్లాడారు. యువకుడికి డబ్బులు ఆశ చూపి కిడ్నీ కొట్టేసిన ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు నిఘా పెట్టాలని చెప్పారు. హోం మంత్రి ఆదేశాలతో బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు.

విజయవాడ కేంద్రంగా ఇటీవల కిడ్నీ రాకెట్ ముఠా మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఆర్థిక ఇబ్బందులతో కిడ్నీ విక్రయానికి అంగీకరిస్తే.. కిడ్నీ తీసుకున్న తర్వాత డబ్బులు ఇవ్వకుండా తనను మోసం చేశారని గుంటూరు జిల్లా కొండా వెంకటప్పటయ్యకాలనీకి చెందిన బాధితుడు మధుబాబు వాపోయారు. ఈ మేరకు సోమవారం గుంటూరు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై హోంమంత్రి అనిత తాజాగా స్పందించారు.

### కిడ్నీ రాకెట్ కేసులో కదలిక

హోంమంత్రి ఆదేశాలతో కిడ్నీ రాకెట్ కేసులో కదలిక వచ్చింది. త్వరిత గతిన కేసును ఛేదించడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తాం గుంటూరు వెస్ట్ డీఎస్పీ మహేష్ తెలిపారు. మోసం చేసి కిడ్నీ తీసుకున్నారని బాధితుడు మధుబాబు నుంచి ఫిర్యాదు అందిందన్నారు. కిడ్నీ మోసానికి సంబంధించి పూర్తి వివరాలు సేకరించాం. పూర్తి వివరాలతో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేస్తాం. దర్యాప్తులో సేకరించిన ఆధారాలతో కేసును ట్రాన్స్‌ఫర్ చేయాలా లేదా అని ఆలోచిస్తాం. ఈ కేసుకు సంబంధించి విచారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేస్తాం. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి త్వరలోనే ఈ రాకెట్‌ను ఛేదిస్తామని డీఎస్పీ తెలిపారు.

# ఎన్టీటీపీఎస్‌లో పేలిన బాయిలర్

**ఇద్దరికి తీవ్ర గాయాలు**

- క్షతగాత్రులకు మంత్రి సుభాష్ పరామర్శ
- మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం
- ప్రమాదంపై మంత్రి కొల్లు ఆరా
- ఐదేళ్ల బూడిద దోపిడీపై విచారణ: దేవినేని



విజయవాడ: వరుస బాయిలర్ పేలుడు ఘటనలతో ఎన్టీఆర్ జిల్లా దద్దరిల్లుతోంది. జగ్గయ్యపేట మండలం బూదవాడ వద్ద అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో బాయిలర్ పేలుడు ఘటనమరవక ముందే ఇబ్రహీంపట్నంలో మరో ప్రమాదం జరగటం కలకలం రేపింది. నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ ఐదవ యూనిట్ బాయిలర్‌లో సోమవారం అర్ధరాత్రి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు రావడంతో ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులను హుటాహుటీన చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఆంధ్ర ఆస్పత్రికి తరలిం చారు. జులై 7వ తేదీన బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలోనూ బాయిలర్ పేలింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. తాజాగా ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో బాయిలర్ నుంచి మంటలు రావడం, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కంపెనీలు అత్యంత ప్రమాదకరమైన బాయిలర్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసేలా, కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### బాధితులకు మంత్రి సుభాష్ పరామర్శ

ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అధికారులను ఆదేశించారు. బాయిలర్ నుంచి మంటలు చెలరేగి గాయపడిన ఇద్దరు కార్మికులను మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. అర్ధరాత్రి సమయంలో ఎన్టీటీపీఎస్ ఐదో దశలో బాయిలర్ ఆగిపోవడంతో కార్మికులు మరమ్మతులు చేపట్టారు. ఆ సమయంలో బూడిద నిల్వ తలుపులు ఒక్కసారిగా తెరుచుకున్నాయి. దీంతో మంటలు చేలరేగి ఓ ఉద్యోగి, మరో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఆంధ్ర ఆస్పత్రికి తరలించగా.. విషయం తెలుసుకున్న మంత్రి వాసంశెట్టి బాధితులను పరామర్శించారు.

### ప్రమాదంపై మంత్రి ఆరా..

ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు దురదృష్టకరమని మంత్రి అన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా ఉందని, వారి కుటుంబాలు అధైర్య పడొద్దని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రమాదవశాత్తూ ఎలాంటి ఘటనలు జరిగినా.. సీఎం చంద్రబాబు అండగా ఉంటారని వాసంశెట్టి చెప్పారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట మండలం బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదాన్ని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలోని పరిశ్రమల యాజమాన్యాలు ఎప్పటికప్పుడు బాయిలర్లను తనిఖీ చేయాలని, కార్మికుల ప్రాణాలను కాపాడే బాధ్యత యాజమాన్యాలదే అని స్పష్టం చేశారు.

### గత ఐదేళ్ల బూడిద దోపిడీపై విచారణ చేస్తాం: దేవినేని

ఎన్టీటీపీఎస్ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయిస్తామని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమా చెప్పారు. బాధితులకు అండగా ఉంటామని ఆయన హామీఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభం చేసిన పాపాలే ఈ దుర్ఘటనకు కారణం అని దేవినేని విరుచుకుపడ్డారు. సట్లు, బోల్టులు మార్చడానికి కూడా పది రూపాయలు వెతుక్కునే పరిస్థితికి థర్మల్ పవర్ స్టేషన్‌ను గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ఐదేళ్లపాటు బూడిద దోచుకుని ఇబ్రహీంపట్నాన్ని బూడిద పట్టణంగా మార్చారని ఆయన మండిపడ్డారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏగా చెప్పుకునే వ్యక్తి థర్మల్ పవర్ స్టేషన్ల సీఈ స్థాయి అధికారులను శాసించి, క్వాలిటీ బూడిదను తరలించి, సిమెంట్ ఫ్యాక్టరీలకు అమ్ముకుని కోట్లు దండుకున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లపాటు బూడిద ఎవరు దోచుకుతున్నారో విచారణ చేసి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాజీ మంత్రి దేవినేని ఉమా హెచ్చరించారు.

### మెరుగైన వైద్యం అందించండి: మంత్రి కొల్లు

ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ ప్రమాదంపై మంత్రి కొల్లు రవీంద్ర విచారం వ్యక్తం చేశారు. బాయిలర్‌కు మరమ్మతులు చేస్తున్న సమయంలో ప్రమాదం జరిగి ఒక ఉద్యోగి, మరో కాంట్రాక్టు కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఘటనకు గల కారణాలపై వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆస్పత్రి సిబ్బందితో మంత్రి కొల్లు ఫోన్లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# మూడుగంటల్లోనే రైతు సమస్య పరిష్కారం

- విద్యుత్ మంత్రి చొరవతో వేగంగా స్పందన
- పొలంలో విద్యుత్ స్తంభం ఏర్పాటుకు చర్యలు
- వేలాడుతున్న తీగలను సరిచేయించిన అధికారులు
- గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన అన్నదాత



అమరావతి: రైతు సమస్యకు మూడు గంటల్లోనే పరిష్కారం చూపి పాలనలో తనదైన శైలిని చూపించారు విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్. కడప జిల్లా ఖాజీపేట మండలం నాగసానిపల్లెలో అబ్బయ్య అనే రైతు పొలంలో విద్యుత్ తీగలు నేలను తాకుతుండేవి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల వర్షాలు పడడంతో దుక్కి దున్నుకునే క్రమంలో పొలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను కుటుంబసభ్యుల సాయంతో పైకి ఎత్తి పట్టుకునేలా చూసుకున్నారు. అయితే దీనికి సంబంధించి ఫొటో సోషల్ మీడియాలో వైరలైంది. ఈ ఫొటో విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కంటపడింది. తక్షణమే స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించాలని స్థానికంగా ఉండే అధికారులకు ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన అబ్బయ్య పొలంలో స్తంభం ఏర్పాటు చేసి తీగలను పైకి లాగించి సరిచేయిం చారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్య మంత్రి గొట్టిపాటి చొరవతో కేవలం మూడు గంటల్లోనే పరిష్కారం అయిందని రైతన్న ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# 2026 నాటికి 'భోగాపురం' పూర్తిచేయాలి

## నిర్మాణసంస్థ జీఎమ్మార్‌కు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశం

- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో 6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు
- ఉత్తరాంధ్రకు గుండెకాయ భోగాపురం ఎయిర్‌పోర్టు

విజయనగరం(చైతన్యరథం): ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిలో ఎంతో కీలకమైన, ఈ ప్రాంతానికి గుండెకాయవంటి భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని 2026 నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిచేయాలని నిర్మాణ సంస్థ జీఎంఆర్ ప్రతినిధులను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించిన ఆయన ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ శాఖల ద్వారా అవసరమైన అనుమతులన్నీ సత్వరమే మంజూరుచేసి పూర్తిసహకారాన్ని అందజేస్తామని చెప్పారు. నిర్ణీత కాలవ్యవధిలో ఈ విమానాశ్రయ పనులను పూర్తిచేసేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. డిసెంబరు 2026 నాటికి పూర్తిచేయాల్సి వుండగా గడువు కంటే 6 నెలల ముందుగా పూర్తిచేయాలని జీఎంఆర్ సంస్థను కోరారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో 6 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలవారు కూడా ఇక్కడికే వస్తారు. దీన్ని సరిగ్గా సద్వినియోగం చేసుకోగలిగితే, భవిష్యత్తులో ఉత్తరాంధ్రకు ఎన్నోకంపెనీలు వస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేయలేక, గడువులు పెంచుకుంటూ పోయిందని, కానీ తాము అధికారంలోకి వచ్చాక మొదటి నెలలోనే ప్రాజెక్టును సందర్శించి, గడువు తేదీ చెబుతున్నామని, ఈ విషయాన్ని తాము ఓ బాధ్యతగా తీసుకుంటున్నామని రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రస్తుత విశాఖ ఎయిర్‌పోర్టు ద్వారా



ఏడాదికి 28 లక్షల మంది ప్రయాణిస్తుండగా 2026 నాటికి కొత్తగా ప్రారంభించే భోగాపురం ఎయిర్‌పోర్టు ద్వారా ప్రారంభంలోనే 50లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈ విమానాశ్రయాన్ని 60లక్షల మంది ప్రయాణించే సామర్థ్యంతో నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రయాణికులతో పాటు 50వేల టన్నుల కార్గో హ్యాండ్లింగ్ చేసే విధంగా కార్గో టెర్మినల్ కూడా నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎయిర్‌పోర్టుతో పాటు ఎం.ఆర్.ఓ.విభాగం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోనే నెంబర్‌వన్ ఎయిర్‌పోర్టుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని రూపొందించే దిశగా కృషిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎయిర్‌పోర్టును సమీప ప్రాంతాల నుంచి అనుసంధానం చేసి త్వరగా, సులభంగా చేరుకునే విధంగా కనెక్టివిటీ రోడ్లను కూడా నిర్మించనున్నట్లు తెలిపారు.

కేంద్ర పౌరవిమానయాన మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం తొలిసారిగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడుకు ఎయిర్ పోర్టు ట్రంపెట్ వద్ద స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు,నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ లతో కలసి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయ నిర్మాణం పనులను పరిశీలించారు. ముందుగా ట్రంపెట్ నిర్మాణం, జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టు అనుసంధాన రోడ్డు నిర్మాణం గురించి, అందుకు అవసరమైన భూసేకరణపై కేంద్ర మంత్రికి జిల్లా కలెక్టర్ అంబేద్కర్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు వివరించారు. అనంతరం ఎయిర్‌పోర్టు టెర్మినల్ భవనం నిర్మాణం పనులను పరిశీలించారు. నిర్మాణం పనులపై ఏర్పాటు చేసిన ప్రజంటేషన్‌ను పరిశీలించారు. రన్‌వే పనులను కూడా కేంద్ర మంత్రి పరిశీలించారు. ఈ పర్యటనలో రెవిన్యూ డివిజనల్ అధికారి ఎంవీ సూర్యకళ, జీఎంఆర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మన్మోయ్ రాయ్, ప్రాజెక్టు హెడ్ టీహెచ్‌వీ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి డోలా

అమరావతి(చైతన్యరథం):రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంగళవారం నాడు వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంత్రిని కలిశారు. చాలా ఏళ్ల నుంచి వసతి గృహాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నామని తమను ఆప్కాస్‌లో చేర్చాలని మంత్రికి విన్నవించారు. ఈ విషయంపై మంత్రి వెంటనే సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీతో ఫోన్‌లో మాట్లాడారు. పలువురు బీసీ సంఘం ప్రతినిధులు.. పేద



బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఏపీ స్టడీ సర్కిల్ సెంటర్లలో ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇప్పించాలని మంత్రిని కోరారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని మంత్రిని కోరారు. ఈ విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

## టీడీఆర్ బాండ్లలో లెక్కలేనంత అవినీతి

- వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం
- విచారణ జరిపించాలని డీజీపీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నేత బుద్దా వెంకన్న

అమరావతి (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వంలో టీడీఆర్ బాండ్లలో లెక్కలేనంత అవినీతి జరిగిందని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసి దోచుకున్నట్లు ఆధారాలు ఉన్నాయని అన్నారు. ఈ కుంభకోణంపై విచారణచేసి చర్యలు తీసుకోవాలని ఏపీ డీజీపీని కోరానని తెలిపారు. ఈ స్కాంకు సంబంధించిన వివరాలను డీజీపీకి అందజేసినట్లు ఆయన వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు మాజీ సీఎం జగన్‌రెడ్డి రూ.42 వేల కోట్లు దోచుకున్నారని అన్నారు.



మళ్లీ జగన్ సీఎం అయ్యాక ఇసుక, గనులు, మద్యం, భూముల మీద దోపిడీ చేశారని మండిపడ్డారు. టీడీఆర్ బాండ్ల విషయంలో కూడా జగన్ కుంభకోణానికి పాల్పడ్డారని చెప్పారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈకొత్త మోసం వెలుగులోకి వచ్చిందని వివరించారు. ప్రభుత్వస్థలం గజం రూ.2వేలు ఉన్నప్రాంతంలో ఎకరాల చొప్పున వైసీపీ నేతలు కొనుగోలు చేశారని ఆరోపించారు.అక్కడ భూముల ధరలుపెంచే అవకాశం ప్రభుత్వానికి ఉంటుందని అన్నారు. కుట్రతో గజం రూ.2వేలు ఉన్న చోట గజం రూ.30వేలు పెంచారని బుద్దా వెంకన్న ధ్వజమెత్తారు.నాడు జగన్ పేషీ నుంచి కలెక్టర్లకు ఆదేశాలుఇచ్చి భూమిధరలు పెంచేలా ఒత్తిడి తెచ్చారని, మున్సిపల్ శాఖ మంత్రిగా నారాయణ వచ్చాక ఈ బాగోతం బయట పడిందన్నారు. జగన్ దోచుకున్న లక్షల కోట్లు కట్టించే వరకు మా పోరాటం చేస్తూనే ఉంటామని బుద్ధా వెంకన్న వ్యాఖ్యానించారు.

## ఎన్జీవో సంఘాలకు, ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

- వారి ఆకాంక్షలకు అనుగుణంగానే చంద్రబాబు పాలన
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలి
- ఆత్మీయ సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ: ముఖ్యమంత్రి చంద్రబాబుపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటారని, ఎన్జీవో సంఘాలకు..ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ భరోసా ఇచ్చారు. కూటమి గెలుపునకు మద్దతుగా నిలిచిన ఎన్జీవో సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఎ.విద్యాసాగర్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి శివనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఎన్జీవో సంఘ నాయకులు, జేఏసీ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కేసులు కూడా ఎదుర్కొన్నారన్నారు. జీతాలు కూడా సకాలంలో రాని పరిస్థితులు చూశారని తెలిపారు. ఉద్యోగులు పెట్టుకున్న నమ్మకానికి, ఆశలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబుపరిపాలన సాగుతోందని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘ నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. రాష్ట్ర అర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగులు అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. నిడమానూరు ఫ్లైఓవర్, విజయవాడ ఈస్ట్రన్ బైపాస్‌కు సంబంధించి న్యూఢిల్లీలో ముఖ్యమంత్రి చేసిన కృషిని ఎన్జీవో సంఘాల నాయకులకు వివరించారు. అనంతరం ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ కేశినేని శివనాథ్ చేపట్టిన సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా తిరువూరు ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. పార్లమెంటు సభ్యుడిగా అందరి మన్నలను పొందుతూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ కార్యాకలాపాలను ముందుకు తీసుకెళ్లే విషయంలో ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్జీవోసంఘ జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణరెడ్డి, మాజీ కార్యదర్శి ఎం.డి.ఇక్బాల్, జిల్లా నాయకులు సతీష్‌కుమార్, శివలీల, రాజబాబు, నగర శాఖ అధ్యక్షుడు సి.హెచ్.వి.ప్రసాద్, కార్యదర్శి నజరుద్దీన్, విజయశ్రీ, ప్రభుత్వ రంగ సంస్థల ఫెడరేషన్ చైర్మన్ ఎ.సాంబశివరావు,నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సాయిరాం, శ్రీనివాస్, పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సినిమా రంగం అభివృద్ధికి సహకరిస్తాం

## - సీనియర్ నిర్మాత కేఎస్ రామారావుతో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు చిత్ర పరిశ్రమ స్థిరపడటానికి తమ ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతి లోని సచివాలయంలో సినీనిర్మాత కేఎస్ రామారావు మంగళవారం సీఎం చంద్రబాబుని కలసి రాష్ట్రంలో సినిమా రంగం అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను చర్చించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీతో సినిమా రంగానికి విడదీయలేని అనుబంధం వుంది. మద్రాసు నుంచి తెలుగు సినిమాను హైదరాబాద్ తరలించడానికి ఎన్‌టిఆర్ ఎంతో కృషి చేశారు. రామారావు తరువాత ముఖ్య మంత్రిగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూడా అదే విధానాలను అనుసరించి సినిమా రంగానికి సంపూర్ణ సహకారాన్ని అందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా గత నెల బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నాయుదుని మర్యాదపూర్వకంగా కేఎస్ రామారావు కలసినప్పుడు రాష్ట్రంలో సినిమా రంగం స్థిరపడానికి ప్రభుత్వం ఏమేమి చర్యలు తీసుకోవాలి అన్న విషయంపై ప్రధానంగా చర్చ జరిగింది. ప్రభుత్వం వైపు నుంచి సినిమా రంగం ఏమేమి ఆశిస్తున్నదో కేఎస్ రామారావు తెలియజేశారు. సీనియర్ నిర్మాత అయిన రామారావు సలహాలు, సూచనలు చంద్రబాబు తీసుకున్నారు. సినిమా రంగం గురించి త్వరలోనే ప్రభుత్వం సమగ్రమైన ప్రణాళికను ప్రకటించే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందటానికి తీసుకోవలసిన చర్యల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫలవంతమైన చర్చ జరిగిందని, చంద్రబాబుకి సినిమా రంగం పట్ల స్పష్టమైన అవగాహన ఉందని, ఆయన మార్గదర్శకత్వంలో ఏపీలో తెలుగు సినిమా పరుగులు తీస్తుందని ఈ సందర్భంగా కేఎస్ రామారావు తెలిపారు.

### గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో 10 మంది వైసీపీ నేతలు అరెస్టు

అమరావతి: గత ఏడాది గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో 10 మంది వైసీపీ నేతల్ని గన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా మిగతా వారికోసం గాలింపుచర్యలు చేపట్టారు. టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో పోలీసులు చర్యలు ప్రారంభించారు. 10 మంది వైసీపీ నేతల్ని గన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. డొక్కు సాంబశివ వెంకన్న, పడమట నాగరాజు, నగేష్, మూల్పూరి ప్రభుకాంత్‌తో పాటు మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ డ్రైవర్ దుర్గా రావును కూడా పోలీసులు అరెస్టు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ అధారంగా మిగతా వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ఏపీజీగా సాంబశివ ప్రతాప్



అమరావతి: రాష్ట్ర అడిష నల్ అడ్వకేట్ జనరల్‌గా సాంబశివ ప్రతాప్ నియమితు లయ్యారు. పశ్చిమగోదావరి పాలకొల్లు మండలం,తిల్లపూడి గ్రామానికి చెందిన సాంబశివ ప్రతాప్ ఉమ్మడి హైకోర్టు లోనూ, విభజిత ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోనూ సీనియర్ న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. బీఎస్సీ బీఎల్, డి.పి.ఎం పూర్తి చేశారు. ఉన్నత న్యాయ స్థానంలో 40 సంవత్సరాలుగా ప్రాక్టీస్ చేసిన అనుభవం ఉంది. 1996 - 2002 మధ్య మున్సిపల్ స్టాం డింగ్ కౌన్సిల్‌గా ఆంధ్రారీజన్ మున్సి పాలిటీలకు సేవలు అందించా రు. 2016-2019 ఉమ్మడి హైకోర్టులో ప్రభుత్వ న్యాయ వాది(జి.పి)గా పనిచేశారు. పలు ప్రముఖ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్ గా విధులు నిర్వర్తించారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి న్యాయ పరమైన సేవలు అందిస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత నుంచి పార్టీ లీగల్ సెల్ ఛైర్మన్ గా ఉన్నారు.

### తెలంగాణ ప్రజలు నిలువునా తొక్కేసినా...

## మీ అహంకారం తగ్గలేదు

**కేటీఆర్ వ్యాఖ్యలపై సోమిరెడ్డి ఘాటు స్పందన**



అమరావతి: ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను టీడీపీ సీనియర్ నాయకుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గట్టిగా తిప్పికొట్టారు.

కేటీఆర్ ఢిల్లీలో మంగళవారం మీడియాతో చిట్ చాట్ చేస్తూ ఏపీ రాజకీయాలపై స్పందించారు. జగన్ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినా ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. వైసీపీ ఓటమి చెందినా.. 40 శాతం ఓట్లు రావడం సాధారణ విషయం కాదన్నారు. కేవలం జగన్‌ను ఓడించడానికి పార్టీలను పావులా వాడుకున్నారని తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూటమితో జతకట్టడం వల్లనే ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. ఏపీ ఫలితాలు మాత్రం తనను షాక్‌కు గురిచేశాయని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై సోమిరెడ్డి ఘాటుగా స్పందించారు. పాలనలో తండ్రి కేసీఆర్ ఫామ్ హౌస్ కు, కొడుకు కేటీఆర్ కలెక్షన్ హౌస్ కు పరిమితమయినందునే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని కాళ్ల కింద పడేసి తొక్కినా, మీ సొంత చెల్లెలు కవిత జైలులో మగ్గుతున్నా మీలో అహంకారం తగ్గకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ అహంకారాన్ని ఆత్మవిశ్వాసంగా భావించడంతో మీ కళ్లకున్న పొరలు ఇంకా తొలగనట్టుందని ఎద్దేవా చేశారు.

ఆ పొగరుతోనే ఆంధ్రప్రదేశ్ నాశనమైపోవాలని కోరుకున్నారు. జగన్ లాంటి నియంత చేతిలో ఏపీ మరో ఐదేళ్లు నలిగిపోవాలని ఆశించారు. అందుకే మీకు తెలంగాణ ప్రజలు ముందుగానే గుణపాఠం చెప్పారు. మా నాయకుడు చంద్రబాబు నాయుదుని అక్రమ కేసులో జైలుకు పంపినప్పుడు మీరు వ్యంగ్యంగా పెట్టిన ట్వీటే మీ కొంప ముంచిందనే విషయం గుర్తుంచుకోవాలని సోమిరెడ్డి ఎక్స్‌లో ధ్వజమెత్తారు.

## ఎన్నారై గోకుల్ రాచిరాజు మృతిపై కోమటి జయరాం సంతాపం



అమెరికా బే ఏరియావాసి ఎన్నారై గోకుల్ రాచిరాజు క్యాన్సర్‌తో మరణించారు. బే ఏరియాలో అందరికీ సుపరిచితుడు, ఆప్తమిత్రుడైన 'గోకుల్' మరణ వార్తతో ఎన్నారైలు శోకసంద్రంలో మునిగిపోయారు. నవ్వుతూ బతకాలిరా తమ్ముడూ.... అంటూ అందరినీ నవ్విస్తూ జోకులు వేసే 'గోకుల్' లేదన్న సమాచారాన్ని మిత్రులు, ఎన్నారైలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన మృతి పట్ల ఎన్నారైలు సంతాపం వ్యక్తం చేశారు. ఆప్తమిత్రుడు 'గోకుల్' మరణ వార్తతో షాకయ్యాయని టీడీపీ ఎన్నారై నేత 'జయరాం కోమటి' అన్నారు. ఆయన మృతిపట్ల 'జయరాం' సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. 'గోకుల్' మరణవార్త విని చాలా బాధ వేసిందని, నవ్వుతూ సరదాగా ఉండే 'గోకుల్' మన మధ్య లేరన్న విషయాన్ని నమ్మలేకపోతున్నానని అన్నారు. 9 నెలల పాటు క్యాన్సర్ మహమ్మారితో పోరాడి తనువు చాలించిన 'గోకుల్' లేని లోటు బే ఏరియా మిత్రుల జీవితాలలో పూడ్చలేనిదన్నారు. 'భౌతికంగా మానుంచి దూరమైనా... నీ జ్ఞాపకాలు మా మదిలో సదా పదిలం. సెలవు మిత్రమా' అంటూ స్వాగత్ స్నేహబృందం 'గోకుల్'కు నివాళి అర్పించింది.

## బ్రిస్బేన్‌లో టీడీపీ విజయోత్సవ సంబరాలు

### ముఖ్య అతిథిగా టాలీవుడ్ నటుడు శివాజీ

ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీలతో కూడిన ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడాన్ని పలుదేశాల్లో ఇంకా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. సీఎంగా చంద్రబాబు ఏపీని అభివృద్ధి పథంలో నడిపించగలరన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జూలై 6న టీడీపీ విజయోత్సవ సంబరాలు క్వీన్స్‌ల్యాండ్ తెలుగుదేశం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వేడుకలకు టాలీవుడ్ నటుడు శివాజీ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. బెల్ బర్డ్ పార్క్, విక్టరీ చర్చ్‌లో ఉదయం 10 గంటల నుంచి విజయోత్సవ సంబరాలు ప్రారంభమయ్యాయి. డీజే,





డ్యాన్స్ ప్రోగ్రామ్, పిల్లల ఆటపాటలు, మ్యాజిక్ షో, ఫేస్ పెయింటింగ్, బెలూన్ ట్విస్టింగ్‌వంటి కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ విజయోత్సవ సంబరాలకు ఆస్ట్రేలియాలోని ఎన్నారైలు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. క్వీన్స్‌ల్యాండ్ తెలుగుదేశం కమిటీ అధ్యక్షుడు విశ్వ దాసరి ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆహూతులందరికీ రుచికరమైన ఆంధ్రా విందు భోజనం వండి వార్చారు. క్వీన్స్‌ల్యాండ్ తెలుగుదేశం కమిటీ సభ్యులు దత్తాత్రేయ బొమ్మసాని, మాధవ్ జొన్నలగడ్డ, భరత్వాజ్ చింతపల్లి, ప్రసాద్ దబ్బర్, నాగార్జున యడ్ల, వంశీ చందు పుట్టగుంట, రామకృష్ణ గూదూరు, భార్గవ సత్య దాసరి, రాజేష్ కణికంటి, రవిచౌదరి గడ్డిపాటి, సాయికృష్ణ వడ్డే, రూపా మనోహర్ అరే, మణి గొట్టుముక్కల, పార్థసారథి నున్న, ప్రసాద్ కోనేరు, గౌతం మంచికలపూడి తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యుత్‌పై శ్వేతపత్రం



గౌరవనీయ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

## విద్యుత్ రంగంపై శ్వేతపత్రం

09 జూలై 2024

## ఎజెండా

1. మొదటి దశ విద్యుత్ రంగ సంస్కరణలు (1994 నుండి 2004 వరకు)
2. రెండో దశ విద్యుత్ రంగ సంస్కరణలు (2014 నుండి 2019 వరకు)
3. వినియోగదారులపై సుంకాల భారం
4. విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పుల భారం
5. ప్రభుత్వ అసమర్థతతో పెరిగిన నష్టాలు
6. విద్యుత్ రంగం బలోపేతానికి మూడో దశ సంస్కరణలు

## మొదటి దశ విద్యుత్ రంగ సంస్కరణలు (1994 నుండి 2004 వరకు)

- విద్యుత్ రంగ సంస్కరణలు
  - దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలో 1998లో విద్యుత్ సంస్కరణల అమలు
  - స్వయం ప్రతిపత్తిగల రెగ్యులేటరీ కమిషన్ (APERC) మొట్టమొదటిసారిగా ఏపీలో ఏర్పాటు
  - APSEB ఆధ్వర్యంలో విద్యుత్ ఉత్పత్తి ట్రాన్స్ మిషన్ పంపిణీపై ప్రత్యేక దృష్టి
  - 2003-04 నాటికి జాతీయ స్థాయిలో విద్యుత్ లోటు 7.1% ఉంటే ఆంధ్రప్రదేశ్ లో 1.5%కు తగ్గింపు
  - విద్యుత్ పంపిణీలో నష్టాలు 1998లో 35% ఉంటే 2003-04 నాటికి 23%కు తగ్గింపు

## రెండో దశ విద్యుత్ రంగ సంస్కరణలు (2014 నుండి 2019 వరకు)

- డిమాండ్ మరియు వినియోగంలో వృద్ధి
  - జూన్ 2014 నాటికి విద్యుత్ లోటు రోజుకు 22.5 మి.యూ., డిసెంబర్ 2014 నాటికి ఆ లోటు భర్తీ
  - జనవరి 2018 నాటికి మిగులు విద్యుత్ సాధించాం
  - విద్యుత్ డిమాండ్ 6,784 మె.వా. నుండి 9,453 మె.వా.(39%) పెరిగింది. వినియోగం 40,174 మి.యూ. నుండి 54,555 మి.యూ. (36%) పెరిగింది.
  - విద్యుత్ కోతలు, విద్యుత్ ఛార్జీలు పెంచకుండా పాలన
  - విద్యుత్ సగటు వినియోగం 1,003 యూనిట్ల నుండి 1,234 యూనిట్లు (23%) పెరుగుదల.. ఇదే జాతీయ స్థాయిలో 1,010 యూనిట్ల నుండి 1,181 యూనిట్లు (17%) పెరుగుదల
- కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం IPDS, DDUGJY, UDAY మరియు Power for All పథకాల కింద రూ.5,000 కోట్లకు పైగా నిధులు
- 800 మెగా.వా. సామర్థ్యంతో VTPS, కృష్ణపట్నం థర్మల్ యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళిక
- ప్రపంచ బ్యాంకు 2016లో చేపట్టిన 'ఎనర్జీ ఎఫిషియన్సీ ఇంప్లిమెంటేషన్ రెడీనెస్'లో మొదటిస్థానం.

Annexure

## రెండో దశ విద్యుత్ రంగ సంస్కరణలు (2014 నుండి 2019 వరకు)

| | FY 2014-15 | Additions | FY 2018-19 |
|---|---|---|---|
| APGENCO Installed Capacity | 4,114 MW | 3,099 MW (75%) | 7,213 MW |
| Transmission Capacity | 29,863 MVA | 17,124 MVA (57%) | 46,987 MVA |
| Installed RE Capacity | 1,342 MW | 6,374 MW (475%) | 7,716 MW |
| Solar Capacity | 66 MW | 2,979 MW (4514%) | 3,045 MW |
| Wind Capacity | 731 MW | 3,346 MW (458%) | 4,077 MW |
| Total Generation Capacity | 5,456 MW | 9,473 MW (174%) | 14,929 MW |

## 2014 నుండి 2019 వరకు... అవార్డులు (2/2)

12 27 46
43 9 6

145 Awards

Notable Awards by National and International Agencies:

- Best Power Utility – Power Generation
- Best Performing Transmission Utility in the Country
- Best State of India for Energy Security, Governance & Sustainability

## విద్యుత్ సంక్షోభం : 2019 to 2024

| నెం. | వివరాలు | మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| A. | వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం | 32,166 |
| B. | విద్యుత్ సంస్థలపై అప్పులు | 49,596 |
| C. | ప్రభుత్వ అసమర్థతతో నష్టాలు | 47,741 |
| | మొత్తం | 1,29,503 |

## విద్యుత్ సంక్షోభం : 2019 to 2024

| నెం. | వివరాలు | మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| A. | వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం | 32,166 |
| B. | విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పులు | 49,596 |
| | మొత్తం | 81,762 |

| నెం. | ప్రభుత్వ అసమర్థతతో జరిగిన నష్టం | మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 1. | వీటీపీఎస్, కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ల ఏర్పాటులో జాప్యంతో నష్టం | 12,818 |
| 2. | పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు జాప్యంతో నష్టం | 4,737 |
| 3. | స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లతో నష్టం | 2,691 |
| 4. | సెకీ 7,000 మె.వా. సోలార్ పవర్ (SECI) నష్టం | 3,850 |
| 5. | అప్పులపై వడ్డీ భారం | 10,892 |
| 6. | APDISCOMs & APPDCL నిర్వహణా వైఫల్యాలతో నష్టం | 9,618 |
| 7. | అన్ని జనరేటర్ల ధరను తగ్గించడం | 3,135 |
| | మొత్తం | 47,741 |

**Grand Total = Rs. 1,29,503 Crore**

*Excluding the expected loss due to ongoing arbitration with initial contractors

## 2019 to 2024 – పారిశ్రామికవేత్తల్లో సడలిన విశ్వాసం - దిగజారిన రాష్ట్ర ప్రతిష్ఠ

- సోలార్, విండ్ పీపీఏల సమీక్ష పేరుతో వేధింపులు
  - పీపీఏలపై ప్రభుత్వ తీరుపై న్యాయస్థానాలు సైతం ఆగ్రహం
  - పీపీఏల టారిఫ్ లు మార్చవద్దని ఏపీ డిస్కమ్ లకు న్యాయస్థానాల ఆదేశాలు
  - బకాయిలు తీర్చడానికి రూ.9,000 కోట్లకు పైగా రుణం తీసుకున్న ఏపీ డిస్కమ్స్
  - 2015, 2018లో ప్రకటించిన రాయితీలను సైతం రద్దు చేశారు
- 21 విండ్ పీపీఏలు, ఇతర ఒప్పందాలు రద్దు
  - ఏపీఈఆర్ సీ వద్ద ఒప్పందాల రద్దుకు మెమో
  - ఏపీ డిస్కమ్ లకు పీపీఏ నిబంధనలు పాటించాలని హైకోర్టు ఆదేశాలు




## 2019 to 2024 – పారిశ్రామికవేత్తల్లో సడలిన విశ్వాసం - దిగజారిన రాష్ట్ర ప్రతిష్ఠ

- సీలేరు పరిధిలోని ఏపీ ట్రాన్స్ కో పనులు రద్దు
  - అవార్డు అయిన పనులు– రూ. 1,315 Crore
  - కాంట్రాక్టు రద్దు చేసే ముందు చేసిన పనుల విలువ– రూ. 406 Crore
  - తాజా అంచనాలు రూ.1,190 కోట్లు – పెరిగిన వ్యయం రూ.281 కోట్లు
- తగ్గిన విద్యుత్ ఉత్పత్తి
  - విండ్, సోలార్ పవర్ ఏర్పాటులో జాప్యంతో ప్రజలపై రూ.500 కోట్ల భారం
  - హిందూజా ప్రాజెక్టు ఆగస్టు 20 నుండి మార్చి 22 వరకు షెడ్యూల్ కాలేదు... సుప్రీంకోర్టు ఆదేశాలతో స్థిర వ్యయం చెల్లించాలి – దీనితో అదనపు భారం రూ.1,235 కోట్లు
  - 2019 నుంచి 2022 మధ్య ఏపీ జెన్ కో ప్లాంట్లు విస్తరణ లేకపోవడంతో పెరిగిన విద్యుత్ కొనుగోళ్లు

# విద్యుత్‌పై శ్వేతపత్రం

చైతన్యరథం

## A. గడచిన ఐదేళ్లలో వినియోగదారులపై మోపిన విద్యుత్ ఛార్జీల భారం

| 2020-24మధ్య ఛార్జీల పెరుగుదల | | 2022-2024లో ట్రూఅప్/ ఇంధన సర్‌ఛార్జీలు | | 2015-2019 వరకు ట్రూ అప్ ఛార్జీలు | | 2023, 2024లో విద్యుత్ సుంకం | | వినియోగదారులపై భారం |
|---|---|---|---|---|---|---|---|---|
| Rs. 16,699 Cr. | + | Rs. 5,886 Cr. | + | Rs. 3,977 Cr. | + | Rs. 5,604 Cr. | = | Rs. 32,166 Cr. |

- గృహ విద్యుత్ వినియోగదారులపై పడిన భారం రూ.8,180 కోట్లు
- గృహ విద్యుత్ వినియోగదారులపై భారం యూనిట్‌కు సరాసరిన రూ.3.87 నుంచి రూ.5.63కి పెరిగింది (45%)
- 153 లక్షల వినియోగదారులు 98శాతం పెరిగిన ధరల భారాన్ని భరించాల్సి వచ్చింది.
- ట్రూ-అప్/ ఇంధన సర్‌ఛార్జీల క్లెయిములు రూ.17,137 కోట్లు. (2023, 2024లో) అనుమతులు రావాల్సి ఉంది.

| నెం. | నెలవారీ వినియోగం (యూనిట్లలో) | 2019 విద్యుత్ ఛార్జీల ప్రకారం బిల్లు (రూ) | 2024 విద్యుత్ ఛార్జీల ప్రకారం బిల్లు (రూ) | పెరుగుదల (శాతంలో) |
|---|---|---|---|---|
| 1. | 50 | 101 | 199 | 98% |
| 2. | 100 | 244 | 453 | 86% |
| 3. | 200 | 632 | 1,123 | 78% |
| 4. | 300 | 1573 | 2,037 | 29% |

* Includes tariff increase, true up/fuel surcharge, true up charges and ED

## B. ఏపీ విద్యుత్ యుటిలిటీస్‌పై పెరిగిన అప్పులు

- గడచిన ఐదేళ్లలో స్వల్పకాలిక రుణాల మొత్తం రూ.49,596 కోట్లకు పెరగడమేకాదు, అదనపు వడ్డీ భారం రూ.10,892 కోట్లు పడింది.
  - 2018-19లో రూ.36,782గా వున్న సీఏపీఈఎక్స్ రుణాలు 2023-24కు వచ్చేసరికి రూ.46,380కోట్లకు పెరిగాయి.
  - 2018-19లో రూ.26,034 కోట్లుగా వున్న ఓపీఈఎక్స్ రుణాలు 2023-24కు వచ్చేసరికి రూ.66,042 కోట్లకు పెరిగాయి.
- నగదు అవసరాల సమన్వయం కోసం 10.11 శాతం వడ్డీ రేటుతో తెచ్చిన స్వల్పకాలిక రుణాలు, అదనపు వడ్డీ భారాలు కలిపి గడచిన ఐదేళ్లలో రూ.10,892 కోట్లకు చేరుకున్నాయి.

మొత్తం రుణభారం రూ.49,596 కోట్లు (79%) (గడచిన 5 ఏళ్లలో)

## ప్రధాన సమస్యలు - బాకీ ఉన్న రాబడులలో ఘాతాంక పెరుగుదల

- ప్రభుత్వ సబ్సిడీ బకాయిలు రూ.7,680 కోట్ల నుంచి రూ.12,681 కోట్లకు పెరిగాయి.
- ప్రభుత్వ శాఖ బకాయిలు రూ.5,265 కోట్ల నుంచి రూ.15,157 కోట్లకు పెరిగాయి.
- వినియోగదారుల నుంచి ట్రూ-అప్/ ఇంధన సర్‌ఛార్జ్ రూ.17,137 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది.
- ప్రభుత్వంనుంచి ఇతరత్రా రావాల్సింది రూ.7,116 కోట్లు.
- తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన బకాయిలు రూ.7,703 కోట్లు.

| నెం | వివరాలు | మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 1. | ప్రభుత్వ సబ్సిడీ బకాయిలు | 12,681 |
| 2. | ప్రభుత్వ శాఖ బకాయిలు | 15,157 |
| 3. | 2022-23 మరియు 2023-24 నాటికి ట్రూ-అప్/ ఇంధన సర్‌ఛార్జీ బకాయిలు | 17,137 |
| 4. | వడ్డీ సహా ఆర్థిక పునర్నిర్మాణ ప్రణాళిక (ఎఫ్ఆర్‌పి) బాండ్లు | 1,109 |
| 5. | ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీఎఫ్‌సీఎల్) యొక్క రుణ సేవ | 2,000 |
| 6. | ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విద్యుత్ డ్యూటీ అడ్వాన్స్ | 3,100 |
| 7. | ఫెర్రో అల్లాయిస్ సబ్సిడీ, ఇంధన సహాయకులకు ప్రోత్సాహకాలు | 907 |
| | Total | 52,091 |

మొండి బకాయిలు రూ.12,945 కోట్ల నుంచి రూ.52,091 కోట్లకు పెరిగాయి. ఫలితంగా నికర పెరుగుదల రూ.39,146 కోట్లు

## విద్యుత్ సంక్షోభం : 2019 to 2024

| నెం. | ప్రభుత్వ అసమర్థతతో జరిగిన నష్టం | మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 1. | వీటీపీయస్, కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ల ఏర్పాటులో జాప్యంతో నష్టం | 12,818 |
| 2. | పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు జాప్యంతో నష్టం | 4,737 |
| 3. | స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లతో నష్టం | 2,691 |
| 4. | ఏడాదికి 7,000 మె.వా. సోలార్ పవర్ (SECI) నష్టం | 3,850 |
| 5. | అప్పులపై వడ్డీ భారం | 10,892 |
| 6. | APDISCOMs & APPDCL నిర్వహణా వైఫల్యాలతో నష్టం | 9,618 |
| 7. | అన్ని జనరేటర్ల ధరను తగ్గించడం | 3,135 |
| | మొత్తం | 47,741 |

*Excluding the expected loss due to ongoing arbitration with initial contractor

## ప్రధాన సమస్యలు - థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటులో జాప్యం

- పనులు నిలిపేసిన కారణంగా వీటీపీఎస్ స్టేజ్-5 యూనిట్ 8 (1x800 ఎండబ్ల్యు) 55 నెలల ఆలస్యమైంది.
  - దీనివల్ల.. అదనపు వ్యయం (ఐడీసీ) రూ.2,029 కోట్లు.
  - ఏటా 4,611 ఎంయు విద్యుత్ కొరత అధిగమించేందుకు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు చేపట్టడంతో రూ.4,895 కోట్ల అదనపు భారం పడింది.
- పనులు నిలిపేసిన కారణంగా ఎస్‌డిఎస్‌టిపీఎస్ స్టేజ్ 2, యూనిట్-3 (1x800 ఎంయు) ఏర్పాటు 44 నెలల ఆలస్యమైంది.
  - దీనివల్ల అదనపు వ్యయం (ఐడీసీ) రూ.2,035 కోట్లు.
  - ఏడాదికి 4,611 ఎంయు ఇంధన కొరతను అధిగమించేందుకు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు చేపట్టడంతో రూ.3,860 కోట్ల అదనపు భారం పడింది.

వీటీపీఎస్: అదనపు ఐడీసీ భారం రూ.2,029 కోట్లు
ఎస్‌డీఎస్‌టీపీఎస్: అదనపు ఐడీసీ భారం రూ.2,035 కోట్లు

థర్మల్ పవర్ ప్లాంట్ల ఏర్పాటులో జాప్యం కారణంగా అదనపు భారం రూ.12,818 కోట్లు.

## ప్రధాన సమస్యలు - పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నెలకొల్పడంలో జాప్యం

- ప్రాజెక్టును మే, 2023నాటికి పూర్తి చేయాలన్న ఒప్పందంతో 6 డిసెంబర్ 2017న టీఎన్‌సీకి కాంట్రాక్ట్ ఇవ్వబడింది.
- టెర్మ్ కీతో ఒప్పందం రద్దు చేసి, నవంబర్ 2019న కొత్త కాంట్రాక్టర్‌ను ఎంపిక చేశారు. అందులో భాగంగానే ప్రాజెక్టును జనవరి 2026కు పూర్తి చేయాలని ఒప్పందాన్ని సవరించారు.
- ప్రారంభ కాంట్రాక్టర్‌ను తప్పించిన కారణంగా సంభవించిన నష్టం రూ.1,500 కోట్లు
- ఆలస్యం కారణంగా, సివిల్ పనుల ధరలు పెరగడంవల్ల నష్టం సుమారు రూ.350 కోట్లు.
- ప్లాంటు నెలకొల్పకపోవడం వల్ల సంవత్సరానికి సుమారు 2,000 మంయుల ఉత్పత్తి నష్టం. మరోపక్క స్వల్పకాలిక ఇంధన కొనుగోలు కారణంగా ఏర్పడిన నష్టం రూ.1,155 కోట్లు.
- జూన్ 2024 వరకు ఉత్పత్తి నష్టం 2,000 మె.వా. వరకు ఉంది. అంటే ఇది రూ.1,155 కోట్లు.
- జనవరి 2026 వరకు ఉత్పత్తి నష్టం 3,000 మె.వా. నష్టం. ఇది 1,732 కోట్లు



పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ ను ప్రారంభించడంలో జాప్యం కారణంగా రూ.4,737 కోట్లు

*Excluding the expected loss due to ongoing arbitration with initial contractor

## కీలక సమస్యలు - స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లలో పెరుగుదల

- కొత్త విద్యుత్ ప్రాజెక్టుల నెలకొల్పడంలో తలెత్తిన జాప్యం స్వల్పకాల విద్యుత్ కొనుగోలును దారితీసింది.
- స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు.. 2019లో 3,373 ఎంయు నుంచి క్రమంగా పెరుగుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి 11,655 ఎంయుకి చేరుకుంది.
- స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు ధర సగటున 2019-20లో రూ.4.02/ కిలోవాట్‌హవర్ నుంచి 2023-24కు చేరేసరికి 7.61/కిలోవాట్‌హవర్ [89%] పెరిగింది.
- గడచిన ఐదేళ్లలో వినియోగదారులపై రూ.26,030 కోట్ల భారంవేసి.. ఏపీ డిస్కంలు స్వల్పకాలిక వనరుల నుండి 43,416 ఎంయులను సేకరించాయి.
- స్వల్పకాలిక కొనుగోళ్ల కారణంగా పెరిగిన ట్రూ-అప్/ఇంధన సర్‌ఛార్జీలను వినియోగదారుల నుండి రికవరీ చేశారు..

మొత్తం స్వల్పకాల విద్యుత్ కొనుగోలు 43,416 ఎంయు

మొత్తం వ్యయం రూ.26,030 కోట్లు

వినియోగదారులపై అదనపు భారం రూ.12,250 కోట్లు

స్వల్పకాల విద్యుత్ కొనుగోలు వల్ల అదనపు భారం రూ.12,250 కోట్లు (ఇంధన నికర మొత్తం)

## 2019-24 : అసమర్థ పాలనతో నష్టాలు

- 7,000 మె.వా. సోలార్ పవర్ ప్రాజెక్టుల జాప్యంతో ఏడాదికి భారం రూ.850 కోట్లు
  - అదనంగా GNA ఛార్జీలు ఏడాదికి రూ.3,000 నుంచి రూ.3,500 కోట్లు
  - మొత్తం భారం ఏడాదికి రూ.3,850 కోట్ల నుంచి రూ.4,350 కోట్లు
  - 5,287 మెగావాట్ల పవన, 12,075 మెగావాట్ల సోలార్ మరియు 17,550 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ లు మంజూరైనప్పటికీ ఏవీ ప్రారంభించలేదు.
  - ఐదేళ్లలో కొత్తగా సోలార్, విండ్ స్టోరేజ్ ప్రాజెక్టులేవీ ప్రారంభించలేదు.

25 ఏళ్లకు నికర భారం రూ.62,000 కోట్లు మేర అదనంగా పడుతుంది.

## 2019 నుండి 2024 వరకు: డిస్కంల రేటింగ్ పతనం

| Sl. No. | Financial Year | APEPDCL | APSPDCL | APCPDCL |
|---|---|---|---|---|
| 1. | FY 2018-19 | A | A | - |
| 2 | FY 2019-20 | C | B | - |
| 3 | FY 2020-21 | D | D | C |
| 4 | FY 2021-22 | B | C- | C |
| 5 | FY 2022-23 | A | B- | B- |

- పేలవమైన ఏపీ పవర్ యుటిలిటీస్ రేటింగ్ లు: కొరవడిన సమర్థత
  - గడచిన ఐదేళ్లలో ఏపీ డిస్కం, ఏపీఎస్పీడీసీఎల్ రేటింగులు 'ఎ' నుంచి 'డి'కి దిగజారింది.
  - అదనపు వడ్డీ రేటు 1.11% గడచిన ఐదేళ్లలో రూ.2,442 కోట్ల అదనపు వడ్డీ భారానికిదారితీసింది.

అదనపు వడ్డీ రేటు 1.11%

## 2019 నుండి 2024 వరకు : నష్టాల అంచనా

- ఏపీ డిస్కంల నష్టాలు: రూ.29,147 కోట్లనుంచి రూ.34,090 కోట్లకు పెరిగాయి.
  - అధిక ధరలకు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లు
  - సబ్సిడీ, ప్రభుత్వశాఖ బకాయిలు రాకపోవడంతో వడ్డీ భారం పడింది.
- ఏపీపీడీసీఎల్ (కృష్ణపట్నం) నష్టాలు రూ.1,565 కోట్లనుంచి రూ.6,240 కోట్లకు పెరిగాయి.
  - స్టేజ్-2 యూనిట్-3ని ప్రారంభించడంలో 44 నెలల ఆలస్యం.
  - అదనపు ఖర్చు (ఐడీసీ) రూ.2,035 కోట్లు.
  - కాల్యాపరణ, అసమర్థత కారణంగా సంభవించిన ఆదాయ నష్టం.

ఏపీ డిస్కం మరియు ఏపీపీడీసీఎల్ యొక్క సంచిత నష్టాలు రూ.30,712 కోట్ల నుంచి రూ.40,330 కోట్లకు పెరిగాయి. నష్టాల పెరుగుదల రూ.9,618 కోట్లు.

*As on 31st March 2024

## 2019 నుండి 2024 వరకు: ఏపీఎస్ జెన్‌కో బాండ్లలో ట్రస్ట్ ఫండ్ పెట్టుబడులు, పవర్ కట్లు మరియు అల్పకాలంలో అల్ప వృద్ధి

- ఏపీఎస్‌పీసీఎల్ బాండ్లలో పీ అండ్ జీ ట్రస్ట్ మరియు పీఎఫ్ ట్రస్ట్ ఫండ్స్ పెట్టుబడి
  - ఏపీజెన్ కో పెట్టుబడి రూ.2,134 కోట్లు
  - ఏపీ ట్రాన్స్ కో పెట్టుబడి రూ.379 కోట్లు
  - మొత్తం = రూ.2,513 కోట్లు
  - 8.5% కూపన్ రేటుతో ఈ బాండ్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హామీ ఇస్తుంది
- పవర్ కట్స్ :
  - 2,566 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పడంలో ఉద్దేశపూర్వక జాప్యం
  - గృహ వినియోగదారులకు విద్యుత్ కోతలు
  - పారిశ్రామిక మరియు వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ కోతలు
- విద్యుత్ కొరత - రాష్ట్ర ఆర్థిక వృద్ధిపై (జీఎస్డీపీ) ప్రభావం
  - విద్యుత్ ఛార్జీల భారీ పెంపు మరియు విద్యుత్ కోతల కారణంగా అల్పకాల వృద్ధి 4.8 శాతానికి పరిమితమైంది. ఇది దేశంలోనే అత్యల్ప వృద్ధి రేటు.

## ముందడుగు: ఇంధన హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- [illegible]
  - [illegible]
- గ్రీన్ హైడ్రోజన్/ గ్రీన్ ఎనర్జీ ఎగుమతి కేంద్రం
  - గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మరియు ఎగుమతుల ప్రోత్సాహం.
  - [illegible]
- [illegible]
- ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం.

సహజ వనరుల వినియోగంతో ఆంధ్రప్రదేశ్‌ను ఇంధన రాజధానిగా మార్చడం.

చైతన్యరథం

# ఉచిత ఇసుక పాలసీతో ఊపందుకోనున్న నిర్మాణరంగం

- నెరవేరనున్న పేదల సొంతింటి కల
- రాష్ట్ర ప్రగతికి బాటలు వేయనున్న ప్రభుత్వ నిర్ణయం
- గతంలో జగన్ ప్రభుత్వం ఇసుక మాఫియాతో కోట్లు కొల్లగొట్టింది
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుపాటి పురంధేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి



**రాజమహేంద్రవరం (చైతన్యరథం) :** తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్రంలో నిర్మాణరంగం ఊపందుకుంటుందని ఇది రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. మంగళవారం లాలా చెరువు ఇసుక స్టాకు పాయింట్ వద్ద ఉచిత ఇసుక ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, కలెక్టర్ ప్రశాంతితో కలిసి మీడియాతో మాట్లాడారు. పరిశీలించారు. ఉచిత ఇసుక అందుబాటులోకి రావడంతో పేదల సొంతింటి కలనెరవేరుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెలరోజులలోపే అమలులోకి తెచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు చేస్తూ జీవో నెంబర్ 43 అమలు చేయడంతో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నది తెలుగుదేశం విధాన మని, పారదర్శకత, ముందుచూపుతో ఈ పాలసీ రూపొందించడం జరిగిందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఈ నిర్ణయంతో సామాన్యులకు భారీ ఊరట లభించిందని దీంతో తమ ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు అభినందిస్తున్నారని పేర్కొన్నారు. ఎందుకంటే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియా నడిపి కోట్లు కొల్లగొట్టిందని, వైసీపీ నేతలే ఇసుకాసుర అవతారం ఎత్తి రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఇసుక కృత్రిమ కొరత సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని దీంతో నిర్మాణరంగం కుదేలైందని మండిపడ్డారు. జగన్ పాలనలో పేదలు ఇల్లు కట్టుకోడానికి రూ.5 లక్షలు ఖర్చు చేస్తే అందులో ఇసుక కొనడానికే రూ.3 లక్షలు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేసిందని ధ్వజమెత్తారు. జగన్ బినామీ సంస్థ జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ. 800 కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని ధారాదత్తం చేశారని విమర్శించారు.

గత ఐదేళ్ళలో వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో సుమారు పది లక్షలకు పైగా ఇళ్ళు కట్టొచ్చంటే వారు ఏ స్థాయిలో అవినీతి చేశారో అర్థం చేసుకోవచ్చని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఇలాంటి అక్రమ తవ్వకాలకు, అవినీతికి తావులేకుండా, రాష్ట్ర ప్రజల ప్రగతే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సారధ్యం లోని తమ ప్రభుత్వం ఈ పాలసీ రూపొందించిందని, దీనిపై నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. సుప్రీం కోర్టు, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు నష్టం కలగకుండా ఉచిత ఇసుకను అందిస్తామని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో శాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు ఎక్కడికక్కడ పర్యవేక్షిస్తారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వివరించారు. పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో త్రాగునీటి సమస్య తీర్చండి

- ఏ పథకానికి ఎన్ని నిధులు మంజూరయ్యాయి
- ఎంత బకాయి ఉందని ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ నీ ప్రశ్నించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



**అనంతపురం (చైతన్యరథం):** నియోజకవర్గంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి జిల్లా తాగునీటి అధికారులను కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నల్లమాడ ఓడి చెరువు అమడుగురు కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లో తాగునీటి సమస్య ఉందని వెంటనే సమస్య పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. అనంతపురం జిల్లా సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ... నల్లమడ మండలం చౌటకుంటపల్లి, సుబ్బరాయనపల్లి, ఓడి చెరువు మండలం నాయనవారిపల్లి కమ్మవారిపల్లి, వేమారెడ్డి పల్లి సమీపంలో ప్రభుత్వం నిర్మించిన గృహ నిర్మాణ కాలనీలో త్రాగునీటి వసతి లేదని, పుట్టపర్తి మండలం బీసీ కాలని, బత్తలపల్లి తదితర గ్రామాల్లో వెంటనే తాగునీటి పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను ఎమ్మెల్యే కోరారు. సత్యసాయి జిల్లాలో తాగునీటి పథకానికి ప్రభుత్వం నుంచి ఏ స్కీంకు ఎన్ని నిదులు వచ్చాయి?

ఇందులో కేంద్రం, రాష్ట్ర వాటా ఎంత మంజూరైందని అని ఆర్ దబ్లు ఎస్ ఎస్ ఈ ఈషన్ బాషాను ప్రశ్నించారు. అలాగే నియోజకవర్గాల వారిగా త్రాగునీటికి ఎంత బడ్జెట్ మంజూరు అయిందో వివరాలు ఇవ్వాలని కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో నాలుగున్నర ఏళ్లుగా సత్యసాయి త్రాగునీటి పథకం పూర్తిగా నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. ఏ గ్రామాలకు కూడా ప్రజలకు కనీసం త్రాగడానికి త్రాగనీరు అందలేదని ప్రశ్నించారు. గ్రామాలకు ఎందుకు త్రాగునీరు ఇవ్వలేదు. గతంలో ఉన్న ఎల్అండ్టీ సంస్థను ఎందుకు తప్పించారు? ఆ తర్వాత కాంట్రాక్టు ఎవరికిచ్చారు? ఎన్ని నిధులు మంజూరయ్యాయి? ఇప్పటి వరకు అ నిధులు ఎవరికి మంజూరు చేశారు ?ఇంకా ఎన్ని నిధులు బకాయిలు ఉన్నాయి ? త్రాగునీటి పథకం కింద జిల్లాలో ఎంతమంది కార్మికులు ఉన్నారు ?ఎన్ని నెలలుగా జీతాలు పిఎఫ్ అలవెన్స్‌లు వారికి ఇవ్వలేదని వాటి వివరాలు ఇవ్వాలని ఎర్ డ బ్ల్యూఎస్ ఎస్సీని ఎమ్మెల్యే అడిగారు. వీటి వివరాలు త్వరలో అందజేస్తామని అయన వెల్లడించారు.

## ప్రజలతో మమేకమై పనిచేయాలి : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

- ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాలి
- యల్లాయపాలెం సచివాలయం పరిశీలన, ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే



**కోవూరు (చైతన్యరథం):** గ్రామీణ ప్రజావసరాలు తీర్చడంలో సచివాలయాలు కీలక పాత్ర పోషించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా తన విజయంలో కీలక పాత్ర వహించిన కొడవలూరు మండలం యల్లాయపాలెం గ్రామస్థులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం యల్లాయపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆమె.. అనంతరం సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న తీరును పర్యవేక్షించారు. పెండింగ్లో ఉన్న సమస్యలపై అధికారులతో సమీక్ష జరిపారు. ప్రజలతో మమేకమై పని చేయాలని, పారిశుధ్యం, వ్యవసాయం, సాంఘీక సంక్షేమ తదితర విభాగాలకు చెందిన సచివాలయ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం యల్లాయపాలెం నాయకులు మరియు గ్రామస్థులతో సమావేశమయ్యారు. పెన్షన్లు, ఇళ్ళ పట్టాలు, స్థానికంగా రోడ్లు, డ్రైన్లు తదితర స్థానిక సమస్యలకు సంబంధించి విజ్ఞప్తులు స్వీకరించారు. తాగునీటి సమస్యకు సంబంధించి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. అనంతరం యల్లాయపాలెం హై స్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులతో విద్యా సంబంధ విషయాలపై చర్చించారు. విద్యార్థినీ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో కొడవలూరు ఎంపిడిఓ ప్రద్యుమ్నరావు, టీడీపీ మండల అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, బెజవాడ వంశీధర్ రెడ్డి, కోదూరు కమలాకర్ రెడ్డి, స్థానిక నేతలు వెంకట్రామి రెడ్డి, వంశి, భూలోక విజయ, బుడుగు శ్రీనివాసులు జనసేన శూలం బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు పక్కా గృహాల కల్పనే తెదేపా ధ్యేయం !



- హౌసింగ్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**విజయవాడ తూర్పు (చైతన్యరథం):** నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడే కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో ముందుకు సాగారని, దానిలో ప్రధానమైనది పక్కా గృహాల కల్పన అని గద్దె రామ్మోహన్ అన్నారు. మంగళవారం ఉదయం అశోక్ నగర్ లోని శాసనసభ్యుని కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సమావేశమై పలు అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం పేదలకు పక్కా గృహాలు కల్పించడం కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని అందులో భాగంగానే షేర్ వాల్ టెక్నాలజీతో టిడ్కో గృహాలను అత్యాధునికంగా అన్ని సౌకర్యాలతో నిర్మాణం చేసిందన్నారు. అలాగే ఎన్టీఆర్ గృహాల పేరుతో పేదలకు ఇళ్ళు నిర్మాణం చేసుకునేందుకు రూ.2.5 లక్షల వరకు ప్రభుత్వ పరంగా సాయం చేయడం జరిగిందన్నారు. 2019 అధికారంలోకి వచ్చిన జగన్ సెంట్ స్థలాల పేరుతో కాలయాపన చేసి మౌలిక సదుపాయాలు కల్పించడకుండా ఇళ్ళు నిర్మాణం జాప్యం చేశారన్నారు. చంద్రబాబు కట్టిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించకుండా పాడుపెట్టారన్నారు.

తూర్పు నియోజకవర్గంలో స్థలాలు పొంది ఇళ్ళు నిర్మాణం నిలిచిపోయి ఇబ్బంది పడుతున్న పేదలకు గృహాలు త్వరిగతిన నిర్మాణం చేసుకునేలా అధికారులు వారికి సహకరించాలన్నారు. గత ప్రభుత్వం ఇసుకకు కృత్రిక కొరత సృష్టించిందని, ఇసుక కొనాలంటే భయపడేలా చేసిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇసుకపై కొత్త పాలసి తెచ్చి ఇసుక ఉచితం చేసి పేదల సొంత ఇంటి కలకు తొలి అడుగులు వేశారన్నారు. సెంట్ స్థలాల్లో ఇల్లు కట్టుకునే వారికి సకాలంలో ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారని, అటువంటి ఇబ్బందులు ఈ ప్రభుత్వంలో లేకుండా చూడాలని అధికారులను గద్దె రామమోహన్ కోరారు. వైకాపా ప్రభుత్వం ఇచ్చిన 20 వేల సెంట్ భూముల్లో కనీసం వెయ్యి అంటే 5 శాతం ఇళ్ళు కూడా పూర్తిచేయలేదన్నారు. 95 శాతం ఇళ్ళు బేస్ మట్టం స్థాయిలోనే ఉన్నాయని లబ్ధిదారులతో అధికారులు మాట్లాడి వారికి అవసరమైన సదుపాయాలు కల్పించి గృహాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డి.ఇ.ఇ విజయ్ బాబు, పి.డి. రజినీ, ఏ.ఇ.కెవిఎస్ కుమార్ లతో పాటు పలువురు హౌసింగ్ ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాన్యుడికి ఊతమిచ్చేలా ఉచిత ఇసుక విధానం

**- ఉచిత ఇసుక ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య**

**జగ్గయ్యపేట (చైతన్యరథం):** రాష్ట్రంలో పాత ఇసుక విధానం రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సామాన్యుడికి ఎంతో లబ్ధి కలుగుతుందని, ఉచిత ఇసుక అందుబాటులోకి రావడంతో లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులు, భవన నిర్మాణదారులు, అనుబంధ రంగాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామం నందు ఉచిత ఇసుక పథకం కింద బుక్ చేసుకున్న లబ్దిదారుల ట్రాక్టర్లు ర్యాలీని స్థానిక నాయకులుతో, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకి ఊతమించేలా ప్రవేశపెట్టిన పథకం ఉచిత ఇసుక విధానం, గత వైసీపీ ప్రభుత్వంలో దాచుకోవడం, దోచుకోవడం ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక రోడ్డునపడి వలసలు వెళ్లారని, వైసీపీ పాలనలో ప్రజలు బాగోగులు మరిచిపోయారని, నేడు తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యంగా బడుగు,బలహీన వర్గాల అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వంతో కలిసి ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. భవన కార్మికులకు 365 రోజులు పనులు కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల కృషి చేస్తున్నారని,



కార్మికుల కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఇసుక దందాలతో సామాన్యులకు ఇసుక దొరకని పరిస్థితి ఉండేది కాదని, ప్రజలకు నేడు ఉచిత ఇసుక దొరికిందన్నారు. ఇసుక లోడింగ్ కోసం, రవాణా ఛార్జీలు పెట్టుకుంటే చాలు అంటూ ప్రభుత్వం ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు.



హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డిని.. రాష్ట్ర మున్సిపల్ శాఖమాత్యులు పొంగూరు నారాయణ ఆసుపత్రిలో పరామర్శించారు.

# ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్ర ప్రగతికి బాట




**- ఊపందుకోనున్న నిర్మాణరంగం**

**- భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు**

**- నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్**

**శ్రీకాకుళం (చైతన్యరథం):** ఎన్డీఏ ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ఇసుక పాలసీ విధానంతో రాష్ట్రంలో ప్రగతి బాట పట్టనుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నూతన ఇసుక పాలసీ విధానానికి స్వాగతం పలుకుతూ ముందుగా ఏడు రోడ్ల కూడలిలో దివంగత మహానేత ఎన్ టీ రామారావు, దివంగత మాజీ కేంద్రమంత్రి ఎర్రం నాయుడు విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలతో ఇసుక కొరత నెలకొని నిర్మాణ రంగం కుదేలైందన్నారు. భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక రోడ్డున పడ్డారని, పనుల్లేక వేలాది మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం రావడంతో నిబంధనలు మార్చి ప్రజలందరికీ ఇసుక లభించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్డీఏ ప్రభుత్వం ఇసుక పాలసీ విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. దీంతో అందరికీ ఉపాధి కలగనుందని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డ నెల రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీ విధానం అమలులోకి తెచ్చి కార్మికులకు, సామాన్య మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచిందన్నారు. గతంలో జగనన్న కాలనీ పేరిట లక్షలాది మెట్రిక్ టన్నుల ఇసుక దోపిడీకి వైసిపి ప్రభుత్వం పాల్పడిందన్నారు. నేషనల్ ట్రిబ్యునల్ నిబంధనలకు తూట్లు పొడిచిందని అన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుకను పేదలకు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన ధరలను నిల్వల కేంద్రాల వద్ద ప్రదర్శించనున్నారని తెలిపారు. ఒక వినియోగదారుడికి రోజుకు గరిష్ఠంగా 20 మెట్రిక్ టన్నుల వరకు అనుమతి ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో ఉన్న వాగులు, వంకల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాలకు వినియోగించుకోవచ్చున్నారు. అనంతరం ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పాత బస్టాండ్ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లారు. దారి పొడవునా డప్పుల సందలతో టిడిపి నాయకులంతా ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన రూరల్, గార మండల నాయకులు, కార్యకర్తలు, శ్రీకాకుళం నగర డివిజన్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

# బీసీల ద్రోహి జగన్ మోహన్ రెడ్డి

**- నిధులు ఇవ్వకుండా బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారు**

**- బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత మండిపాటు**



విజయవాడ (చైతన్యరథం): బడుగు, బలహీన వర్గాల ద్రోహిగా వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డిని బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.ఎస్ సవితమ్మ అభివర్ణించారు. నా బీసీ, నా బడుగులని ఓట్లు వేయించుకొని బీసీలను అన్ని రంగాలలో మోసం చేశారని మండిపడ్డారు. బీసీల అభివృద్ధి టీడీపీతోనే అని మంత్రి పునరుద్ఘాటించారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా, గొల్లపూడి లో ఉన్న బీసీ సంక్షేమ భవన్‌ను గౌరవ బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పరిశీలించారు. అనంతరం మంత్రి సవిత మీడియా తో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం బీసీలు ఉన్నారని, టీడీపీ ప్రభుత్వం బీసీల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. 2019 ఎన్నికల్లో నా బీసీ, నా బడుగులు అని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ బీసీ... కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా అణగదొక్కారన్నారు. గొప్పల కోసం కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు కానీ, కార్పొరేషన్లకు నిధులు కానీ విధులు కానీ లేవన్నారు. కనీసం కుర్చోవడానికి కుర్చీలు కూడా కేటాయించలేక పోయిందని తెలిపారు. బీసీల బాగుకోసం పనిచేయాల్సిన కార్పొరేషన్ చైర్మన్లు విధులు తమ బాధ్యతలు నిర్వహించకుండా జీతాలు తీసుకొని వైసీపీ కార్యకర్తల్లా పనిచేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమ్మకంతో 50 శాతం జనాభా ఉన్న బీసీల సంక్షేమ బాధ్యతను అప్పగించారని, వారి సంక్షేమం కోసం పనిచేస్తానని చెప్పారు. జనా భా లెక్కల ప్రకారం బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి బీసీలకు పూర్వ వైభవం తెస్తామని మంత్రి తెలిపారు. మంత్రి పర్యటన లో బీసీ ఎండి సిహెచ్ కిశోర్, జనరల్ మేనేజర్ బీమ్ శంకర్, టీడీపీ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక అందుబాటులోకి రావడం హర్షణీయం

**- టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు**



**అమరావతి (చైతన్యరథం):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిర్ణయంతో అన్ని ప్రాంతాల్లోని కార్మికులు ఆనందంతో సంబరాలు నిర్వహించుకుంటున్నారని అన్నారు. ఉచిత ఇసుక విధానం అమలులోకి రావడాన్ని హర్షిస్తూ విజయవాడ నగరంలో టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. మా కష్టాలు తొలిగాయి... పనులు దొరికాయి అంటూ కార్మికులు ఆనందపడుతున్నారని, మొన్నటి వరకు పనులు లేక కార్మికులుక పస్తులు పడుకున్నారని అన్నారు. ఎన్నికల ముందు కార్మికుల కళ్ళల్లో కన్నీళ్లు చూసిన చంద్రబాబు. ఇప్పుడు ఆనందం నింపారని అన్నారు. రూ.1800 భవన నిర్మాణ సంక్షేమ నిధిని కూడా జగన్ ప్రభుత్వ మళ్లించిందని, ఇప్పుడు ఆ నిధులను కూడా తిరిగి తీసుకువచ్చి.. కార్మికులకు భరోసా ఇవ్వాలని కోరుతున్నామని రఘురామరాజు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెంటపల్లి శ్యామ్, అదిబాబు, నాగ మల్లేశ్వరరావు, కోశాధికారి ఆకుల సూర్య ప్రకాష్, తెలుగునాడు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎస్ కె ఉమ్మర్ వలి, పెనమలూరు నియోజక వర్గ అధ్యక్షులు సత్యనారాయణ, బాల యాదవ్, చందు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతల భూ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేయాలి

**- టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): వైసీపీ నేతల భూ అక్రమాలపై రాష్ట్రస్థాయిలో ప్రత్యేక దర్యాప్తు బృందం - సిట్ ఏర్పాటు చేస్తే మేలని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వానికి సూచించారు. చిత్తూరు నుంచి ఉత్తరాంధ్ర వరకు వైసీపీ గద్దలు చెరబట్టిన భూముల్ని విడిపించాలన్నా, బాధితులకు సత్వర న్యాయం జరగాలన్నా అదే మేలన్నారు. మరీ ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి నుంచి అతడి కోటరీ విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి లే కాక నాటి సీఎస్ జవహర్‌రెడ్డి పైనే తీవ్రమైన ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్‌కు అప్పగించడమే ఉత్తమమన్నారు ప్రత్తిపాటి. ఆ మేరకు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారాయన. వైసీపీ అయిదేళ్ల అరాచక పాలనలో ఒక్క విశాఖ, ఉత్తరాంధ్రలో 40వేల ఎకరాలు పైగా భూఆక్రణలు జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయని, అవన్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా వైసీపీ నేతల తోనే ముడిపడి ఉండడం దారుణమైన విషయమన్నారు. నాటి ప్రభుత్వంలో సీఎంవో నుంచి గల్లీస్థాయి నాయకులకు వరక అంతా కుమ్మక్కై నడిపించిన భూస్వాహ పర్వంలో సామాన్యుల బాధలు వినేనాథుడు కూడా లేకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరీముఖ్యంగా పేదలకు ఏదో మేలు చేస్తున్నట్లు నటించి... అసైన్డ్‌భూములపై శాశ్వత హక్కుల పేరుతో వారి జీవ నాధారంగా ఉన్న పొలాలు లాక్కున్న దుర్మార్గపు పాలన నాడు రాష్ట్రమంతా చూసిందన్నారు ప్రత్తిపాటి. ఈ నేపథ్యంలోనే త్వరలో విడుదల చేయనున్న శ్వేతపత్రంలో భూదోపిడీ మొత్తం ప్రజల ముందుకు తీసుకుని వస్తామని, అదేవిధంగా భూముల రీసర్వే, చట్టంలో లొసుగులతో ఎన్నిభూములు కొట్టేశారో కూడా నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. మరీ ముఖ్యంగా నాటి ప్రభుత్వంలో ఉన్నపెద్దలే బినామీల అడ్డం పెట్టుకుని విలువైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు కాజేశారని, తనవి, తనకు కావాల్సిన కంపెనీలకు సీఎంగా జగన్ అడ్డదారుల్లో వేలాది ఎకరాలు కట్టబెట్టేసిన తీరుపైనా నిజాలు వెల్లడి కావాలని ఆయన ఆకాంక్షించారు. అవేకాక జగనన్న కాలనీల పేరిట పేదల ఇళ్లస్థలాల పథకంలోనూ భారీగా దోచేశారని, భూములు చేతులు మారాయని, రాష్ట్ర చరిత్రలో ఎవరూ చేయనిరీతిలో రెవిన్యూ రికార్డుల్ని తారుమారు చేశారన్నారు. వైసీపీ అయిదేళ్ల ఈ భూ అక్రమాలపై కఠినచర్యలతో పాటు ఆస్తులు మొత్తం రికవరీ చేయాల్సిన అవసరం ఉందని పుల్లారావు పేర్కొన్నారు.

# ఐదేళ్ల తర్వాత భవన నిర్మాణ రంగం కార్మికుల కళ్లల్లో ఆనందం

**- టీడీపీ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్**

**గుంటూరు (చైతన్యరథం):** చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. మంగళవారం గుంటూరులోని పట్నంబజార్‌లో ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెట్టినందుకు గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ భవన నిర్మాణ కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి కార్మికులకు కండువాలు కప్పి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ... ప్రజల అవసరాల కోసం ఆదాయాన్ని కోల్పోతున్నప్పటికి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేశారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెల రోజుల్లోనే అమల్లోకి తీసుకొచ్చి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ పథకం వల్ల లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులు అనుబంధ రంగాల్లో పనిచేసే వారికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు ఇసుకను భారీగా దోపిడీ చేశారని, ఇసుక దొరక్క వినియోగదారులు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. గతంలో గృహ నిర్మాణ శాఖ 98 లక్షల టన్నులు ఇసుకను జగన్మోహన్ రెడ్డి బినామీ సంస్థలు మింగేసారని, ప్రజలకు ఇసుక కొనుగోలు భారం కాకూడదనే తెలుగుదేశం పార్టీ



ప్రభుత్వం ఉచిత ఇసుకను అందజేస్తుందని తెలిపారు. గతంలో మాదిరిగా ఇసుకను దుర్వినియోగం దోపిడీకి గురికాకుండా అక్రమాలకు తావులేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వర్మ నరేంద్ర, డిప్యూటీ మేయర్ సజీలా, కార్పరేటర్ చిస్టీ, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, వార్డ్ అధ్యక్షులు సలీం, చిన్న బుజ్జి, కరీముల్లా, హాఫీజ్, పాటిబండ్ల బలరాం, అన్వర్, జనసేన 12 డివిజన్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, సురే శీను, ఖాసిం,తదితరులు పాల్గొన్నారు.

# పురుషోత్తపట్నం ఫేజ్ - 2 నుండి సాగునీరు విడుదల

**- పాల్గొన్న ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరపుల సత్య ప్రభ, పిఠాపురం, జనసేన ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్**



**కాకినాడ (చైతన్యరథం):** జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో పురుషోత్తపట్నం ఫేస్ టు నుండి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, పిఠాపురం జనసేన ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ సాగునీటిని విడుదల చేశారు. ముందుగా లిఫ్ట్ వద్ద చేరుకున్న ఎమ్మెల్యేలకు ఇరిగేషన్ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గోదావరి నీటికీ హారతి ఇచ్చి ముగ్గురు మూడు పంపుల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ కూడా ఈ కార్యక్రమానికి రావాల్సిందే కానీ అనివార్య కారణాలవల్ల ఆయన షెడ్యూల్ ఖాళీ లేకపోవడం వల్ల రాలేకపోయారని నెహ్రూ అన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారని అప్పటినుండి ఇక్కడ ఎమ్మెల్యేలు ఎవరైతే ఆఎమ్మెల్యేలు ప్రారంభించడం ఆనవైతిగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాలు వైసీపీ ఎమ్మెల్యేలకు అవకాశం జగన్మోహన్ రెడ్డి ఇవ్వలేదని ఐదు సంవత్సరాలు కూడా ఎత్తిపోతల పథకాలు అన్నీ కూడా పనిచేయకుండా పోయాయని మళ్లీ వీటిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మరమ్మతులు చేసి ఈరోజు నీటిని విడుదల చేయడం జరుగుతుందని ఏలేరులో నీటి సామర్థ్యాన్ని పెంచి రైతులందరికీ నీళ్ల అందించేందుకు ఈ పంపుల్ని ప్రారంభించామని తెలిపారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పోలవరం దగ్గర నుంచి పురుషోత్తపట్నం పుష్కర తాడిపూడి పట్టిసీమ ఇలా అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆఖరికి తాళ్లూరు లిఫ్ట్ వల్ల 33,000 ఎకరాలు పంట రైతులు నష్టపోయారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, జంపన సీతారామచంద్ర వర్మ, గొల్లపల్లి బుజ్జి, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గం సంబంధించి టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి మత్తును వదిలించండి



**- పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశం**

**గుంటూరు (చైతన్యరథం):** పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి అనేక మంది యువత తమ జీవితాన్ని నాశనం చేసుకొని సామాన్య ప్రజలపై దాడులకు పాల్పడుతున్నారని వీరిని కట్టడి చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులకు సూచించారు. మంగళవారం నల్లచెరువు 19వ డివిజన్‌లో ఉదయం 6.00 గంటల నుండి డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వినతులు స్వీకరించి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనేక మంది మహిళలు తమ డివిజన్‌లో వీధి దీపాలు, డ్రైన్ల సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవికి దృష్టికి తీసుకొనిరాగా, ఈ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది మహిళలు తమ పిల్లలు గంజాయికి బానిసలు అయ్యారని, శానిటైజర్ వంటి విషపదార్థాలను తీసుకుంటున్నారని వీటిని అరికట్టాలని ఎమ్మెల్యే ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. పోలీసు అధికారులు వెంటనే దీని మీద దృష్టి సారించాలని ఎమ్మెల్యే మాధవి కోరారు. అదే మాదిరిగా నల్లచెరువు వాకింగ్ ట్రాక్‌లో సాయంత్రం వేళల్లో వాకర్స్ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నామని, కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, త్వరంలోనే స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసి, పోకిరిల ఆగడాలను కట్టడి చేస్తానని గళ్ళా మాధవి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో రాళ్లబండి రామరాజు, తెలుకుట్ల హనుమాయమ్మ, రహీం, చంద్రగిరి బాబు,యోగేశ్వరావు, పులి కృష్ణ, బత్తుల రమణమ్మ,పరిమి రమేష్, ఉమర్ వలి, విజయలక్ష్మి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు..

## కర్నూలు ప్రభుత్వాస్పత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తాం

**- ఆసుపత్రికి వచ్చే రోగులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తాం**

**- ఎం.పి బస్తిపాటి నాగరాజు**



**కర్నూలు (చైతన్యరథం):** కర్నూలు ప్రభుత్వాస్పత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తామని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు. ప్రభుత్వాస్పత్రిని అకస్మికంగా తనిఖీ చేసిన ఎంపి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డితో కలిసి పలు వార్డులను సందర్శించి ఆసుపత్రిలో అందిస్తున్న సౌకర్యాలు, చికిత్సల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సూపరింటెండెంట్ తో ఆసుపత్రి కి సంబంధించిన పలు అంశాల పై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎం.పి మాట్లాడుతూ డెవలప్మెంట్ కమిటీని ఏర్పాటు చేసి ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఇక గత ప్రభుత్వంలో సరైన వైద్య సదుపాయాలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఆసుపత్రికి వచ్చే రోగులకు కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో వైద్య సేవలను అందించేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.



అసంపూర్తిగా మిగిలిన కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు

# ఉచిత ఇసుక విధానంపై హర్షం వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ప్రజలు

**- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారు నాయక్**

**అమరావతి (చైతన్యరథం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రారంభించిన ఉచిత ఇసుక విధానాన్ని రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారు నాయక్ వ్యాఖ్యనించారు. ఈ ఉచిత ఇసుక విధానం ప్రతి భవన నిర్మాణ కార్మికుడి ఇంట సొంత ఇంటికల నెరవేర్చుకోవాలని, ఎదురుచూస్తున్న ప్రతి పేదవాడి ఇంట ఒక పండగ వాతావరణం సృష్టిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సహజ వనరులపై హక్కులను ప్రజలకు చెరవేయడమే లక్ష్యంగా ఈ ఉచిత ఇసుక విధానాన్ని మన ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్జీటీ ఎన్నోసార్లు ఆంక్షలు విధించిన వేటిని లెక్కచేయకుండా అక్రమంగా ఇసుకను కొల్లగొట్టారని మండిపడ్డారు. ఆ ధనాన్నంతా వైసీపీ నాయకులు తమ జేబుల్లో వేసుకున్నారు. సామాన్యుడికి ఇసుక దొరకని పరిస్థితి గత ఐదేళ్లు నెలకొందని అన్నారు. ఇటువంటి సందర్భంలో రాష్ట్ర ఖజానాకు కొంత నష్టం కలిగిన, ప్రజలకు మరీ ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభించడానికి, అలాగే దినసరి కూలీలకు ఉపాధి లభించడానికి దోహదం చేస్తుందన్న సదుద్దేశంతో ఈ ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. గనుల శాఖ



అధికారులు మొత్తం 43 లక్షల టన్నుల ఇసుక ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రజలే నేరుగా ఇసుక డిపోల వద్దకు లారీ, ట్రాక్టర్ల వంటి వాహనాలు తీసుకొని వచ్చి ఇసుకను తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఇసుక అవసరమున్న వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఇసుక మీద ప్రభుత్వానికి ఎటువంటి రాబడి లేకుండా కేవలం నిర్వహణ ఛార్జీలు, సీనరేజీ ఛార్జీలకు మాత్రమే ఇసుక అందిస్తుంది. సీనరీ ఛార్జీలు సైతం గ్రామపంచాయతీలకు అప్పగించే ఏర్పాట్లు ప్రభుత్వం చేసిందని అన్నారు. దీనితో స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయి. గత వైసీపీ పాలనలో స్థానిక సంస్థల నుంచి అన్ని విధానాలలో దోచుకోవడం జరిగిందే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. ప్రజా కూటమి ప్రభుత్వ ఏర్పడిన వెంటనే చెప్పిన మాట ప్రకారం ఒక్కొక్కటిగా ముందడుగు వేస్తూ రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులేస్తుందని ధారు నాయక్ అన్నారు.


అసమర్థుని పాలనలో
రూ. 47,741 కోట్ల నష్టం
2019-2024 మధ్యకాలంలో జరిగిన విద్యుత్ నష్టం
సోలార్ విద్యుత్
వాడుకోకుండానే
రూ. 9 వేల కోట్లు చెల్లింపు
గృహ వినియోగదారులపై
రూ. 8,180 కోట్ల భారం
మొత్తం ఐదేళ్ళ పాలనలో
రూ. 32,166 కోట్లు
ప్రజల నుంచి జగన్ దోచాడు